PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 52 | విజయవాడ, ఆదివారం 22 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 22 September 2024 | Rs

పాఠ్యాంశంగా గురజాడ జీవితం

- 162వ జయంత్యుత్సవంలో మంత్రి శ్రీనివాస్

3



కమ్యూనిస్టు యోధ, కార్మికవర్గ పక్షపాతి, పీడిత ప్రజల ప్రియతమ నేత సీతారాం ఏచూరికి సంబంధించిన వ్యాసాలు, కథనాలతో 'లాల్ సలాం' ప్రత్యేక అనుబంధాన్ని నేటి సంచికతో పాటు అందజేస్తున్నాం.

- సంపాదకులు

విజయవాడ ఎంబివికెలో నేడు ఏచూరి సంతాపసభ

2

వరద ప్రభావిత అంశాలపై సహచర మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న చంద్రబాబు

వరద బాధితులకు 25న పరిహారం

ఎన్యూమరేషన్, పరిహారం చెల్లింపులపై సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలకు పరిహారం అందజేతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 25న బాధితులకు పరిహారం అందించాలని నిర్ణయించారు. విజయవాడలో వరదకు మునిగిన ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్ వారికి రూ.25 వేలు, మొదటి, ఆపై వారికి రూ.10 వేలు చొప్పున పరిహారం అందించనున్నారు. చనిపోయిన పశువులకు, నష్టపోయిన వ్యాపారులకు కూడా ఆర్థికసాయం అందించనున్నారు. పరిహారం విషయంలో తమ పేరు నమోదు కాలేదనే ఫిర్యాదు ఎక్కడా రాకూడదని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. 10 వేల వాహనాలకు గానూ ఇప్పటి వరకు 6 వేల వాహనాలకు బీమా సెటిల్‌మెంటు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వాహనాలకు కూడా బీమా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సిఎం ఆదేశించారు.

టిటిడి నెయ్యిలో రివర్స్ టెండర్లు ఏమిటి?

తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి)లో శ్రీవారికి నివేదించి.. వితరణ చేసే లడ్డూ ప్రసాదం తయారీలోనూ రివర్స్ టెండర్లు పిలవడం ఏమిటని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. లడ్డూ విషయంలో తప్పు చేసింది కాక డైవర్షన్ పాలిటిక్స్ అని ఎలా చెబుతారని ఆయన విస్మయం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను చంద్రబాబు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రభుత్వం మారిన వెంటనే తిరుమల ప్రక్షాళన చేయాలని టిటిడి కొత్త ఇఒకు చెప్పానని అన్నారు. ఆయన అనేక చర్యలు తీసుకోవడంతో పాటు లడ్డూ నాణ్యత పెంచారని చెప్పారు. పలు కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టారని తెలిపారు. నాణ్యత కోసం నందిని నుంచి మళ్ళీ నెయ్యి కొనుగోలు చేశారని వివరించారు. లడ్డూ వ్యవహారం నేపథ్యంలో మఠాధిపతులతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ప్రసాదాల నాణ్యత పరీక్షలు, అవసరమైన సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

టిటిడిలో అవినీతి అక్రమాలపై విచారణ

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ నాణ్యత, నెయ్యి కల్తీతో సహా మొత్తం టిటిడిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిడిడిపై వస్తున్న వార్తలు, అవినీతి, అక్రమాలపై వెలువడుతున్న కథనాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. లడ్డూల నాణ్యత, నెయ్యి కల్తీపై జులైలోనే ఎన్‌డిడిబి ల్యాబ్ నివేదిక వచ్చినప్పటికీ చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేసిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజల్లోనూ, భక్తుల్లోనూ వస్తున్న ఆందోళనలను తొలగించి విశ్వాసాన్ని కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఈ సందర్భాన్ని అవకాశంగా తీసుకుని సంఘ్ పరివార్ సహా, మతోన్మాద శక్తులు ప్రజల్లో భావోద్రేకాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. భక్తుల్లో అపోహలు సృష్టించి ఇతర మతస్తులపై విద్వేషాలు పెంచేందుకు ఈ శక్తులు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. మతోన్మాదుల స్వార్థపర రాజకీయ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండి, సామరస్యంగా వ్యవహరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు అగ్నికి ఆజ్యం పోయకుండా సంయమనం పాటించాలని, ప్రధానంగా అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిపిఎం కోరింది.

అక్టోబర్ నుంచి ఫర్నేస్-2లో ఉత్పత్తి

2

చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం

- నిండా ముంచిన వరద
- సమస్యాత్మకంగా యంత్రాల మరమ్మతులు, ముడి సరుకుల కొనుగోలు
- బీమా క్లెయిములు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

బుడమేరు వరదలు, భారీ వర్షాలకు చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నమయ్యాయి. ఆ పరిశ్రమల యజమానులను వరద నిండా ముంచింది. విజయవాడ సింగ్ నగర్, కండ్రిక, భవానీపురం, కబేళా తదితర ప్రాంతాల్లో ముంపునకు గురైన చిన్న పరిశ్రమలు ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేదు. నీటిలో మునిగి తుప్పుపట్టిన యంత్రాల మరమ్మతులు, పూర్తిగా పనికిరాకుండా పోయినవాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకోవడం, ఉత్పత్తుల ప్రారంభానికి ముడి పదార్థాలు సమకూర్చుకోవడం ఆ పరిశ్రమల నిర్వాహకులకు పెద్ద సమస్యగా మారింది. కబేళా పారిశ్రామికవాడతోపాటు, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ముంపునకు గురైన చిన్న పరిశ్రమల నిర్వాహకులకు కోట్లాది రూపాయల మేర నష్టం వాటిల్లింది. బీమా క్లెయిములు, తిరిగి పెట్టుబడికి అవసరమైన పూర్తి స్థాయి రుణాలు సమకూరిస్తేనే పరిశ్రమలను పున:ప్రారంభించగలమని వారు చెబుతున్నారు. కొత్త యంత్రాలను ఏర్పాటు చేసుకోవడానికి, పనికొచ్చే పాతయంత్రాలకు మరమ్మతులు చేయించుకోవడానికి, ముడి సరుకులు సమకూర్చుకోవడానికి పరిశ్రమ సామర్థ్యం ఆధారంగా కనీసం రూ.5 లక్షల నుంచి అత్యధికంగా కోటి రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని బాధిత కంపెనీల నిర్వాహకులు వాపోతున్నారు.

- విజయవాడ కబేళా పారిశ్రామికవాడలో కాటూరి రవిచంద్రకు వైభవ్ పాలిమర్స్, ఎం.సురేంద్రకు సిఎస్‌కె పాలిమర్స్ కంపెనీలు ఉన్నాయి. 50 మిల్లీలీటర్లు, 50 గ్రాముల నుంచి ఐదు లీటర్ల సామర్థ్యంగల ప్లాస్టిక్ డబ్బాలు, ఐదు కిలోల సామర్థ్యంగల ప్లాస్టిక్ డబ్బాలు, భారీ ప్యాకింగ్‌తో ప్లాస్టిక్ కంటెయినర్లు తయారు చేస్తారు. బుడమేరు వరదలకు ఈ కంపెనీలు పది రోజులు నీటిలో మునిగి ఉన్నాయి. భారీ యంత్రాలు, వాటిలో ఉపయోగించే మోటార్లు, ఎయిర్ కంప్రెషర్లు, కూల్‌వాటర్ చిల్లర్లు, కరెంటు ప్యానళ్లు, కంప్యూటర్లు, డైలు, ముడి పదార్థాలు దెబ్బతిన్నాయి. రవిచంద్రకు రూ.40 లక్షలు, సురేంద్రకు రూ.2 కోట్ల నష్టం వాటిల్లింది. కబేళా పారిశ్రామికవాడలో 20 పాలిమర్స్ కంపెనీలదీ ఇదే పరిస్థితి.

కాటూరి రవిచంద్ర

కెఎల్.లక్ష్మీకాంతరావు

ఎం.సురేంద్ర

- వై.ఎల్.లక్ష్మీకాంతరావుకు ఉన్న శ్రీకృష్ణా బైండింగ్ వర్క్స్ కంపెనీలో నోటు పుస్తకాలు తయారు చేస్తారు. బైండింగ్ కంపెనీ వర్క్ కూడా ఉంది. రూ.1.70 కోట్ల విలువైన నోటు పుస్తకాలు, మెటీరియల్స్ తడిచిపోయి పనికిరాకుండా పోయాయని కంపెనీ యజమాని తెలిపారు. విజిఎస్ పబ్లిషర్స్, శ్రీనివాస అండ్ కో, రవి అండ్‌కో, వంశీ అండ్‌కో, వెంకటేశ్వర ట్రేడర్స్, మమత పేపర్స్, సత్యం బైండింగ్, కావ్య బుక్ ట్రేడర్స్ తదితర మరో 15 సంస్థలూ నష్టపోయాయి. వాటి గొడౌన్లన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో, ఒక్కో సంస్థకు సగటున కోటి రూపాయలకుపైగా నష్టం వాటిల్లింది. సయ్యద్ నసీమాకు చెందిన జిఎం ఫుడ్ ప్రొడక్ట్స్ కంపెనీలో ఆహార పదార్థాలకు రుచులు, మంచి వాసన అందించే ఉత్పత్తులు తయారు చేస్తారు. బాదం, జీడిపప్పు, షుగర్, యాలకులు, లవంగ, చెక్క, జాజికాయ, ధనియాలు, జీలకర్ర, లిక్విడ్ తదితర ముడి సరుకులు వరద ముంపునకు గురయ్యాయి. దీంతో, ఆ కంపెనీకి రూ.60 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఎ.ప్రవీణ్‌కు చెందిన బాలాజీ కంపెనీలో చీపుర్లు తయారు చేస్తారు. చీపురు గడ్డి, కంప్రెసర్లు నీటిలో మునిగిపోవడంతో రూ.8 లక్షల మేర నష్టం వాటిల్లింది. పాడైన చీపురు గడ్డి తరలించడానికి, శుభ్రపరచడానికి లారీ కిరాయిలు, ఇతర ఖర్చులు లక్ష రూపాయలు అయ్యాయి. రంగులు, స్టీల్ వస్తువుల తయారీ పరిశ్రమలు ఇదే పారిశ్రామికవాడలో వంద వరకు ఉన్నాయి. విజయవాడ అజిత్‌సింగ్ నగర్, కండ్రిక, భవానీపురం తదితర ప్రాంతాల్లో మరో 150 వరకు పరిశ్రమలు ముంపునకు గురయ్యాయి.

బీమా, రుణ ప్రయత్నాల్లో కంపెనీల నిర్వాహకులు

- కాటూరి రవిచంద్ర తన కంపెనీకి రూ.18 లక్షలకు, ఎం.సురేంద్ర తన కంపెనీకి రూ.2 కోట్లకు ప్రీమియం చెల్లించారు. రూ.40 లక్షలు నష్టపోయిన రవిచంద్రకు రూ.18 లక్షలకు మాత్రమే పాలసీ తీసుకున్నారు. బీమా కంపెనీలు పరిహారం ఎంత చెల్లిస్తాయో తెలియకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బీమా క్లెయిములు మిగతా 2లో

ముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేస్తున్న అతిషి

ఢిల్లీ సిఎంగా అతిషి ప్రమాణం

- మరో ఐదుగురు మంత్రులు కూడా..

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా అతిషి మర్లేనా సింగ్ పదవీ స్వీకార ప్రమాణం చేశారు. శనివారం నాడిక్కడి రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో ఆమెతో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) వికె సక్సేనా ప్రమాణం చేయించారు. అతిషితో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. సుల్తాన్ పూర్ మిర్జా నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ముకేశ్ అహ్లావత్‌కు కొత్త కేబినెట్‌లో చోటు దక్కింది. సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లాట్ మంత్రులుగా తమ స్థానాలను నిలుపుకోగా, ఇమ్రాన్ హుస్సేన్ మంత్రిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఆప్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా, ఆప్ ముఖ్య నేతలు హాజరయ్యారు. ఢిల్లీ లిక్కర్ పాలసీలో అరెస్టయి, అయిదు నెలలపాటు తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్ ఇటీవల విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత ఆయన తన పదవికి రాజీనామా చేసి, అతిషికి ఆ బాధ్యతలు అప్పగించారు. కేజ్రీవాల్ జైలులో ఉన్న సమయంలో అతిషి కీలకంగా వ్యవహరించారు. ఆర్థిక, విద్య, రెవెన్యూ వంటి మొత్తం 14 మంత్రిత్వ శాఖలను ఆమె నిర్వహించారు.

కార్మికోద్యమ నేత లారెన్స్ కన్నుమూత

కోచి : కార్మికోద్యమ నేత, సిపిఎం సీనియర్ నాయకులు ఎం.ఎం.లారెన్స్ (95) శనివారం నాడిక్కడ ఆస్పత్రిలో కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధ సమస్యలతో ఆయన గత కొంతకాలంగా బాధ పడుతున్నారు. కార్మికుల హక్కుల కోసం గట్టిగా పోరాడిన యోధుడు. కేరళలో పారిశుధ్య పనివారలందరినీ ఏక తాటిపైకి తెచ్చిన తొలి తరం కార్యకర్తల్లో ఆయన ఒకరు. ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు, బంధువుల సందర్శనార్థం ఆస్పత్రి నుంచి ఆయన నివాసానికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయం లెనిన్ సెంటర్‌కు తీసుకెళతారు. అటు పిమ్మట ఎర్నాకుళం టౌన్‌హాల్‌లో ప్రజల సందర్శనార్థం వుంచుతారు. అనంతరం వైద్య పరిశోధనల నిమిత్తం ఎర్నాకుళం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఆయన భౌతికకాయాన్ని అందజేస్తారు.

పాట్నా ఎన్‌ఐటిలో అనంతపురం విద్యార్థిని ఆత్మహత్య

- డైరెక్టర్ రాజీనామా చేయాలని విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లోని పాట్నాలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటి)లో రాష్ట్రానికి చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో యాజమాన్యానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళనకు దిగారు. నిట్ డైరెక్టరు పికె జైన్ రాజీనామాకు విద్యార్థులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన పల్లవి రెడ్డి (20) శుక్రవారం రాత్రి కాదంబిని హాస్టల్‌లోని తన గదిలో ఉరి వేసుకుని ప్రాణాలు విడిచింది. గతేడాదే క్యాంపస్‌లో చేరిన పల్లవి రెడ్డి బిటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ)లో రెండో సంవత్సరం చదువుతోంది. పల్లవి ఆ రోజు సాధారణంగానే ఉందని, ఎలాంటి డిప్రెషన్‌కు గురికాలేదని ఆమెతోపాటు అదే గదిలో ఉంటున్న ఇద్దరు విద్యార్థినులు తెలిపారు. శుక్రవారం రాత్రి భోజనానికి తన రూమ్‌మేట్స్‌ను పంపి ఆమె వెళ్లలేదు. రూమ్‌మేట్స్ భోజనం చేసి తిరిగి రూమ్ వద్దకు వచ్చే సరికి పల్లవి ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. యాజమాన్యం సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు.. తలుపులను పగలగొట్టి, సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్న పల్లవిని కిందకు దింపి, ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చినట్లు బిహ్తా పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఒ) రాజ్‌కుమార్ పాండే శనివారం తెలిపారు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభ్యమైందని, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. పాట్నా సిటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (వెస్ట్) శరత్ ఆర్‌ఎస్ మాట్లాడుతూ.. సమాచారం అందిన వెంటనే పోలీసులు, 112 డయల్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకున్నారని, విద్యార్థిని మొదట బిహ్తాలోని ఇఎస్‌ఐసి ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు. ఫోరెన్సిక్ బృందం ఆ సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకుంది. ఆమె మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు పాట్నా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) రాజీవ్ మిశ్రా తెలిపారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు క్యాంపస్ వెలుపల ఆందోళన చేపట్టారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిహ్తా హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేవని, విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోని నిట్ పాట్నా డైరెక్టరు పికె జైన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల నేపథ్యంలో క్యాంపస్‌లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

శ్రీలంక ఎన్నికల్లో 75శాతం పోలింగ్

ఎన్నికల సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

కొలంబో : శనివారం జరిగిన కీలకమైన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో 75శాతం పోలింగ్ నమోదైంది. ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదని, భద్రతా ఉల్లంఘనలు నమోదు కాలేదని ఎన్నికల కమిషన్ పేర్కొంది. 4గంటలకు పోలింగ్ ముగిసిన వెంటనే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు జరుగుతుంది. ఆ తర్వాత సాధారణ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లెక్కింపు ప్రారంభమైన రెండు మూడు గంటలతర్వాత ఫలితాలు వస్తాయని కొలంబో నగర డిప్యూటీ ఎన్నికల కమిషనర్ బందారామప తెలిపారు. 2019 నవంబర్‌లో 83 శాతం ఓటింగ్ నమోదుకాగా, ఈసారి 75 శాతానికే పరిమితం కావడం గమనార్హం. 22 ఎలక్టోరల్ జిల్లాల పరిధిలో 13,400 పోలింగ్ స్టేషన్లలో ఎన్నిక జరిగింది. ఓటింగ్‌ను పురస్కరించుకుని శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య జరిగే టెస్ట్ మ్యాచ్‌కు కూడా ఒక రోజు బ్రేక్‌ఇచ్చారు. 85 ఫిర్యాదులు అందాయని, వాటిని నిశితంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక సమస్యలే కీలకంగా మారిన ఈ ఎన్నికల్లో ముక్కోణపు పోటీలో వున్న ముగ్గురు అభ్యర్థులు దేశ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణపై హామీలిచ్చారు. ప్రస్తుత అధ్యక్షుడు విక్రమసింఘేతోపాటు నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి)కి చెందిన అనుర కుమార దిసనాయకే, సమగి జన బలవేగయ (ఎస్‌జెబి) పార్టీ నుంచి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సజిత్ ప్రేమదాస పోటీలో ఉన్నారు. శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు మనదేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలో జరుగుతాయి. ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు ఆధారంగా అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. పోటీలో ఉన్న అభ్యర్థులలో ఎవరికి 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు వస్తే వారే అధ్యక్షుడిగా ఎన్నికవుతారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోతే, రెండో ప్రాధాన్యతా ఓట్లను లెక్కిస్తారు. ఇప్పటివరకూ శ్రీలంకలో జరిగిన ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతోనే ఫలితం తేలిపోయింది.

ధరాఘాతం

- నిత్యావసరాల ధరలు పైపైకి
- సామాన్యులు విలవిల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కందిపప్పు కొండెక్కి కూర్చొంది. కూరగాయల ధరలూ మండిపోతున్నాయి. వంట నూనెల ధరలు సలసలా కాగుతున్నాయి. ఆదాయం కంటే ఖర్చులు అధికమవడం, గతంలో ఎన్నడూ లేనివిధంగా నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు. కిలో కందిపప్పు ధర డబుల్ సెంచరీ కొట్టేలా కనిపిస్తోంది. రెండు వారాల క్రితం కిలో కందిపప్పు రూ.150 ఉండగా, ప్రస్తుతం రూ.173కు చేరింది. ఎండుమిర్చి ధర కిలో రూ.180 నుంచి రూ.220కు ఎగబాకింది. వెల్లుల్లి సామాన్యులకు అందనంత దూరం వెళ్లిపోయాయి. గత నెలలో కిలో రూ.240 ఉండగా, ప్రస్తుతం ఏకంగా రూ.400కు చేరింది. చింతపండు రూ.110 నుంచి రూ.140కు పెరిగింది. శనగపప్పు రూ.90 నుంచి రూ.100కు చేరింది. పెసలు రూ.115 నుంచి రూ.130, మినుములు రూ.110 నుంచి రూ.125, వేరుశనగ నూనె రూ.140 నుంచి రూ.160, ధనియాలు రూ.105 నుంచి రూ.120, నువ్వులు రూ.160 నుంచి రూ.170, పామాయిల్ రూ.80 నుంచి రూ.95, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.105 నుంచి రూ.128 చొప్పున ధరలు పెరిగాయి.

దిగిరాని కూరగాయల ధరలు

కూరగాయల ధరలూ ఇంకా దిగిరాలేదు. ఉల్లి ధర ఘాటు ఇంకా తగ్గలేదు. కిలో ఉల్లిని రూ.50 నుంచి రూ.70 వరకూ విక్రయిస్తున్నారు. కిలో అల్లం రూ.160కు చేరింది. రూ.10 ఉండే కొత్తిమీర కట్ట రూ.60 పలుకుతోంది. టమోటా గత నెల రూ.30 ఉండగా, ప్రస్తుతం రూ.50కు చేరింది. రూ.40 ఉన్న వంకాయల ధర రూ.60కు పెరిగింది. బెండకాయలు, కాకర, బీరకాయలు, గోరు చిక్కుళ్లు, దోస తదితర కూరగాయలు గత నెలలో 30 నుంచి రూ.35 మధ్యలో ఉండగా, తాజాగా రూ.50 నుంచి రూ.60 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. తీగ చిక్కుళ్లు గత నెలలో కేజీ రూ.80 కాగా, వీటి ధర ప్రస్తుతం రూ.120కు చేరింది. వానలు, వరదల నేపథ్యంలో కూరగాయల పంటలు పాడయ్యాయి. కొత్తగా వేసిన పంట చేతికి రావాలంటే, కనీసం రెండు నుంచి మూడు వారాలు పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే కూరగాయల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

నెలవారీ బడ్జెట్ పెరిగింది

మా ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులం ఉన్నాం. నిత్యావసరాల కొనుగోలుకు నెలకు రూ.10 వేల వరకూ వెచ్చించక తప్పడం లేదు. విద్యుత్, పాల బిల్లు కలిపి మరో రూ.3 వేల వరకూ అవుతోంది. ఇంటి అద్దె గతంలో రూ.4,500 ఉండగా, ఇంటి పన్నులు పెరగడంతో అద్దె మరో రూ.500 పెంచడంతో రూ.5 వేలకు చేరింది. ఆరోగ్య అవసరాలకు, దుస్తుల కొనుగోలుకు ఇబ్బందులు తప్పేలా లేవు.

- వి.రాజేష్, సుబ్బారావుపేట రాజమహేంద్రవరం

ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలి

ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామనే ప్రచారం విస్తృతంగా చేస్తున్నాయి. మరోవైపు దొడ్డిదారిన పన్నులు, ఛార్జీల రూపంలో వసూలు చేస్తున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రతి కుటుంబంలో భార్యభర్తలు ఇద్దరూ కష్టపడినా కుటుంబ ఖర్చుల కోసం ఇబ్బందులు తప్పడం లేదు. ధరల నియంత్రణపై పాలకులు దృష్టి పెట్టాలి.

- కె.రామలక్ష్మి ఆర్యాపురం, రాజమహేంద్రవరం

వైమానిక దళ అధిపతిగా అమర్‌ప్రీత్ సింగ్

న్యూఢిల్లీ : త్రివిధ దళాల్లో ఒకటైన భారత వైమానిక దళ (ఐఎఎఫ్) చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ నియమితులయ్యారు. యుద్ధ విమానాల పైలట్ అయిన సింగ్ ప్రస్తుతం ఐఎఎఫ్ వైస్ చీఫ్‌గా వున్నారు. ప్రస్తుతమున్న ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌదరి ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆ రోజునే సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఐఎఎఫ్‌కు నాయకత్వం వహించిన సిక్కు అధికారుల్లో ఎయిర్ మార్షల్ సింగ్ నాల్గవ వారు. 1984లో ఫైటర్ పైలట్ విభాగంలోకి వచ్చిన సింగ్ దాదాపు 40ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక పదవులు నిర్వహించారు. ప్రయాగ్‌రాజ్‌లోని ఐఎఎఫ్ సెంట్రల్ కమాండ్‌కు ఆయన కమాండర్‌గా కూడా పనిచేశారు. 1964 అక్టోబరు27న జన్మించిన అమర్ ప్రీత్‌సింగ్ నేషనల్ డిఫెన్స్ అకాడెమీ, డిఫెన్స్ సర్వీసెస్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1984లో భారత వైమానిక దళంలో చేరారు.

తీరంలో కాంక్రీట్ కట్టడాలు కూల్చివేత

- విజయసాయిరెడ్డి కుమార్తెవని చర్చ

తీరంలో సాగుతున్న కూల్చివేత పనులు

ప్రజాశక్తి- భీమునిపట్నం (విశాఖపట్నం)

విశాఖ జిల్లా భీమిలి సాగర తీరాన సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కాంక్రీట్ కట్టడాలను జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో శనివారం మళ్లీ కూల్చి వేశారు. ఆ కట్టడాలు వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి కుమార్తె నేహా రెడ్డివని భావిస్తున్న నేపథ్యంలో స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ కట్టడాల విషయమై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఈ ఏడాది ఫిబ్రవరి 23న హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సుమారు నాలుగు ఎకరాల స్థలంలో స్టార్ హోటల్ నిర్మాణానికి నేహారెడ్డి పూనుకున్నారని ఆయన ఈ వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ పిల్‌పై హైకోర్టు ఆదేశాలతో రెండు వారాల క్రితమే జివిఎంసి అధికారులు కూల్చివేతలు మొదలుపెట్టారు. అయితే, అవి ఇటీవల ఆగాయి. కట్టడాలను పూర్తి స్థాయిలో నేలమట్టం చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో జివిఎంసి అధికారులు ఆ దిశగా మళ్లీ చర్యలు చేపట్టారు.

పిన్నెల్లి పిఎ శ్రీనివాసశర్మ కిడ్నాప్, విడుదల

ప్రజాశక్తి- మాచర్ల (పల్నాడు జిల్లా)

మాచర్ల మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పర్సనల్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసశర్మను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నల్ల రంగు స్కార్పియో వాహనంలో పట్టణంలోని ఆయన నివాసానికి వచ్చారు. ముందుగా ఇద్దరు ఇంట్లోకి ప్రవేశించారు. తరువాత మరో నలుగురు ఇంట్లోకి ప్రవేశించి శ్రీనివాసశర్మతో కొద్దిసేపు మాట్లాడారు. ఆ తర్వాత బలవంతంగా స్కార్పియో వాహనంలో తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసశర్మ కుటుంబ సభ్యులను రూరల్ సిఐ హఫీజ్‌బాషా విచారించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి 8 గంటలు దాటిన తరువాత శ్రీనివాసశర్మ గాయాలతో ఇంటికి చేరుకున్నారు. పిన్నెల్లి ప్రత్యర్థులే ఆయనపై దాడి చేసినట్టు తెలిసింది. కిడ్నాప్ చేసిన తరువాత కొట్టి విడిచిపెట్టినట్టు పోలీసులకు శర్మ కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. గత 20 ఏళ్లుగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వద్ద పిఎగా శర్మ పనిచేస్తున్నారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

హైదరాబాద్: హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సికింద్రాబాద్, తార్నాక, నాచారం, ఉప్పల్, రామంతాపూర్, మేడిపల్లి, కోఠి, చిక్కడపల్లి, ముషీరాబాద్, ఎల్‌బినగర్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఐటీ కారిడార్‌తోపాటు సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్‌బినగర్ తదితర ప్రాంతాల్లో వాహనాలు బారులు తీరాయి. అత్యధికంగా ఖైరతాబాద్‌లో ఎనిమిది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గోల్కొండలో 7.3, ఆసిఫ్‌నగర్‌లో 7.1, మెహదీపట్నంలో 6.4, సికింద్రాబాద్‌లో 5.8, నాంపల్లి, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో 5 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

సమావేశంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామస్వామి, వైటి దాసు, జె అయోధ్యరామ్, గుర్తింపు సంఘం (ఎఐటియుసి) నాయకులు డి ఆదినారాయణ

ఉక్కు కార్మిక సంఘాల నేతలతో సమావేశమైన స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జ్ సిఎండి అరుణ్ కుమార్ బాగ్చి

అక్టోబర్ నుంచి ఫర్నేస్-2లో ఉత్పత్తి

- స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జ్ సిఎండి అరుణ్ కుమార్ బాగ్చి
- ఉక్కు కార్మిక సంఘాలతో సమావేశం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

అక్టోబర్ నెలాఖరుకు రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జ్ సిఎండి అరుణ్ కుమార్ బాగ్చి తెలిపారు. శనివారం ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. ప్లాంట్‌ను మూసివేస్తారన్న దానిలో వాస్తవం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతానికి కేంద్రం నుంచి రూ.500 కోట్లు మంజూరయ్యాయని, ఆ డబ్బులతో జిఎస్‌టి కట్టామని చెప్పారు. ఇంకా నిధులు రానున్నాయని, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అన్ని యూనియన్ల నాయకులు ఉక్కు యాజమాన్యంతో పలు అంశాలపై చర్చించారు. ప్లాంట్ ఉత్పత్తిలో మొదటి నుంచి కార్మికులు కష్టపడి పని చేస్తున్నారని, వారికి ఎప్పటికప్పుడు ప్లాంట్‌లో ఏం జరుగుతుందో హెచ్‌ఆర్ డిపార్టుమెంట్ తెలియజేయాలని కోరారు. యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు తెలియక మొత్తం కార్మికవర్గం ఆందోళనకు గురవుతోందన్నారు. ఆరు నెలలుగా ఉద్యోగుల పే స్లిప్‌లో కట్ చేసిన పిఎఫ్, త్రిఫ్ట్ ఫండ్, ఎస్‌ఎబిఎఫ్‌లను ముందుగా జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు నగరంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. 2019 నవంబర్ నుంచి ఉద్యోగ నియామకాలు నిలిపివేశారని, ఇప్పుడు ఉన్న కార్మికులతో బ్లాస్ట్ ఫర్నేస్ 3ను నడిపించడం కష్టమని తెలిపారు. ఈ నేపథ్యంలో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ జరపకుండా, ఇప్పటికే పని చేస్తున్న ఉద్యోగులను విఆర్‌ఎస్, డిప్యుటేషన్ పేర్లతో బయటకు పంపితే ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పారు. కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఉక్కు ఉద్యోగులకు జీతాలు నెల మొదటి తేదీనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ సిఎండి మాట్లాడుతూ ఈ నెలలో ఉద్యోగుల మిగిలిన సగం జీతం 23న చెల్లిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, కెఎస్‌ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, ఎన్.రామచంద్రరావు, విల్లా రామ్మోహన్ కుమార్, వి.శ్రీనివాసరావు, రామ్ కుమార్, బి.డేవిడ్, లక్ష్మణరావు, నరేంద్ర కుమార్, సురేష్ బాబు, కె.శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల కోసం కన్సల్టేటివ్ ఫోరం

- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- సిఐఐ సమావేశంలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా ప్రభుత్వంతో చర్చించేందుకు కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు చేయనున్నట్లు విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వారం రోజుల్లో వస్తాయని తెలిపారు. విజయవాడలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యాన నిర్వహించిన సదరన్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో శనివారం పాల్గొని లోకేష్ మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఇందుకు కావాల్సిన రాయితీలు ఇవ్వడంతోపాటు మౌలిక సౌకర్యాలు, ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. పెట్టుబడులు పెట్టించేందుకు ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డులో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో తీసుకున్న పిపిఎల రద్దు నిర్ణయం వల్ల రాష్ట్రంతో పాటు దేశం కూడా నష్టపోయిందని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధిలో సిఐఐ కీలకపాత్ర పోషించాలని కోరారు. విశాఖను ఐటి హబ్‌గా రూపొందించడంతోపాటు డేటా సెంటర్, ఎఐ యూనివర్సిటీని నెలకొల్పుతామని చెప్పారు. ఆయా జిల్లాల్లో ఉన్న వనరుల ఆధారంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నూతన ఆలోచనలతో ముందుకెళ్తున్నామని, ఉద్యోగాల కల్పనే ఏకైక అజెండా అని పేర్కొన్నారు. ఎంఎస్‌ఎంఇల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న విస్తృత అవకాశాలను సిఐఐ ప్రతినిధులకు వివరించారు.

'ఉక్కు' ఉద్యోగుల అలవెన్స్‌లు నిలిపివేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉక్కు ఉద్యోగులందరికీ ఎల్‌టిసి / ఎల్‌ఎల్‌టిసి / ఎల్‌టిఎతో పాటు ఇంటి అద్దె భత్యం చెల్లింపులు నిలిపివేస్తున్నట్లు ఉక్కు యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. అధికారులు పొందుతున్న ముందస్తు అలవెన్స్‌లను గ్రేడ్‌ల ప్రకారం 12 శాతం, ఆరు శాతానికి తగ్గించేసింది. ఆగస్టు 2024 నుంచి పై నిర్ణయాలు అమలులోకి వచ్చేలా కాంపిటెంట్ అథారిటీ ఆమోదంతో ఆదేశాలు జారీ చేసినట్టు ఉక్కు యాజమాన్యం తన ప్రకటనలో తెలిపింది.

దారుణమైన నిర్ణయం : స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్

కార్మికుల అలవెన్స్‌లను నిలిపివేస్తూ ఉక్కు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఖండించారు. కార్మికులను ఉత్తేజపరిచే నిర్ణయాలతో ఉత్పత్తి పెరుగుతుంది తప్ప హక్కులను, వేతనాలను, అలవెన్స్‌లకు కోత విధించడం వల్ల కాదని తెలిపారు. ప్లాంట్ యాజమాన్యం తీరుమార్చుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

కొనసాగుతున్న 'లడ్డూ లడాయి'

- నేటి నుంచి పవన్ ప్రాయశ్చిత దీక్ష

ప్రజాశక్తి - యంత్రాంగం

శ్రీవారి లడ్డూలో వినియోగించే నెయ్యి నాణ్యతపై లడాయి కొనసాగుతోంది. అధికార, ప్రతిపక్ష నేతల ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి) ప్రసాదం విషయంలో వివాదం చెలరేగిన నేపథ్యంలో అందుకు ప్రాయశ్చిత్తంగా తాను దీక్ష చేపట్టనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. గుంటూరు జిల్లా నంబూరులోని శ్రీదశావతార వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 11 రోజుల పాటు ఆయన ఈ దీక్ష చేయనున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం గత పాలకుల వికృత పోకడల ఫలితంగా అపవిత్రమైందని తెలిసి తాను తీవ్ర వేదనకు గురయ్యానని తెలిపారు.

విచారణ జరపండి : బొత్స

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నాణ్యత లేని పదార్థాలు వాడారని సిఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నానని, లడ్డూ వ్యవహారంపై విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని వైసిపి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విచారణ అనంతరం తప్పు జరిగిందని తెలిస్తే ఎంతటి వారినైనా శిక్షించాలన్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టు లేదా సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో కమిటీ వేసి విచారణ జరపాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై ఏర్పాటు చేసిన రాజకీయ ప్రసంగంలో లడ్డూపై అసత్యాలు మాట్లాడటం దురదృష్టకరమని అన్నారు. జగన్‌పై కక్ష తీర్చుకోవడానికే చంద్రబాబు ఈ ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆక్షేపించారు. టిడిపి కూటమి ప్రభుత్వం వంద రోజులు మౌనంగా ఉండి వైఎస్ జగన్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని వివాదం చేస్తోందన్నారు. ఎన్‌డిడిబి నివేదికను టిడిపి కార్యాలయంలో ఎలా రిలీజ్ చేస్తారని నిలదీశారు.

గవర్నరుకు కాంగ్రెస్ వినతి

తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యి కల్తీ జరిగిందనే అంశంపై సిబిఐతో విచారణ చేయించి వాస్తవాలను నిగ్గుతేల్చాలని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వైఎస్ షర్మిల నేతృత్వంలోని ప్రతినిధి బృందం కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, మాజీ ఎమ్మెల్యేలు మస్తాన్‌వలి, ఆమంచి కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి మూసాని శ్రీనివాస్‌రెడ్డి.. రాజ్‌భవన్‌లో శనివారం గవర్నరు అబ్దుల్ నజీర్‌ను కలిశారు. సిబిఐతో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. జులై 23న ల్యాబ్ రిపోర్టు వస్తే సిఎం చంద్రబాబు ఇంతకాలం ఎందుకు దాచారని ప్రశ్నించారు. కల్తీ జరిగింది వైసిపి పాలనలోనేనని, తక్కువ కోట్ చేసిన కంపెనీకి ఎందుకు కాంట్రాక్టు ఇచ్చారని వైసిపి నేతలను షర్మిల ప్రశ్నించారు. ఒక ప్రాంతీయ పార్టీ తమ ఆర్థిక ప్రయో జనాలకు తిరుమల లడ్డూను వాడుకుందని, మరో ప్రాంతీయ పార్టీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు.

శ్రీవారి ఆలయ సంప్రోక్షణ

శ్రీవారి ఆలయాన్ని సంప్రోక్షణ చేయాలని టిటిడి నిర్ణయించింది. సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు శాంతియాగాన్ని జరపనుందని విశ్వసనీయ సమాచారం.

నేడు ఏచూరి సంతాపసభ

- ఎంఎ బేబీ, బివి రాఘవులు హాజరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల మరణించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభ ఆదివారం ఉదయం విజయవాడలో జరగనుంది. ఉదయం 10 గంటలకు మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ, బివి రాఘవులు హాజరు కానున్నారు. వీరితోపాటు టిడిపి నేత, రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటారు. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శీరం రమేష్, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి బి బంగార్రావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు జాస్తి కిషోర్‌బాబు పాల్గొంటారు. ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, ఆర్‌ఎస్‌పి నాయకులు జానకిరాములు, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, ఎస్‌యుసిఐసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ అమర్‌నాథ్ పాల్గొంటారు. తెలుగుదేశం, జనసేన తదితర రాజకీయ పార్టీల నాయకులూ పాల్గొని నివాళులర్పించనున్నారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించనున్నారు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - కాజులూరు(కాకినాడ జిల్లా)

చెరువులను జెసిబితో ధ్వంసం చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఆక్వా చెరువులను నిర్వహిస్తున్నారని పేర్కొంటూ వైసిపి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు చెందిన చెరువులను అధికారులు శనివారం ధ్వంసం చేశారు. అక్కడి భూములను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెంలో 9.45 ఎకరాలను తోట త్రిమూరులు 16 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. వీటిని ఆక్వా చెరువులుగా మార్చారు. అయితే, ఇవి ల్యాండ్ సీలింగ్ భూములంటూ మూడేళ్ల క్రితం జనసేన నేత లీలాకృష్ణ ఆరోపణ చేశారు. దీనిపై కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో వివాదాస్పద చెరువులను శనివారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో కాకినాడ డిఎస్‌పి, ఆర్‌డిఒ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది నాలుగు జెసిబిలతో ధ్వంసం చేశారు. కాకినాడ డిఎస్‌పి రఘువీర్‌విష్ణు, కాకినాడ రూరల్ సిఐ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దీనిపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పందించారు. ఇవి పట్టాభూములని, దీనికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపారు. గోడకు నోటీసు అంటించి తెల్లవారుజామునే ధ్వంసం చేయడం సరికాదన్నారు. అధికారులు ఎవరి మెప్పు పొందడం కోసం ఇదంతా చేస్తున్నారని ప్రశ్నించారు.

జూలై వరకు రు. 37 వేల కోట్ల రుణం

- రిజర్వ్‌బ్యాంకు నెలవారీ బులిటెన్‌లో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఈ ఏడాది జులై నెల వరకు రాష్ట్ర ప్రభుత్వం రు.37 వేల కోట్ల రూపాయలను రుణంగా సేకరించింది. ఈ మేరకు రిజర్వుబ్యాంకు నివేదికను విడుదల చేసింది. ఆగస్టు నెలకు సంబంధించిన ఈ బులిటెన్‌లో మే, జూన్, జూలై నెలలకు మొత్తం 2.14 లక్షల కోట్లను రుణాలుగా అన్ని రాష్ట్రాలకు అందించగా, అందులో ఆంధ్రప్రదేశ్‌కు రు.37 వేల కోట్ల రూపాయలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.రెండో స్థానంలో తమిళనాడు రాష్ట్రం రు. 33 వేల కోట్లతో ఉంది.

ఆర్‌బిఐ గణాంకాల మేరకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ 57,478 కోట్లు మార్కెట్ రుణాలుగా సేకరించగా, 2023-24 సంవత్సరంలో 68,400 కోట్లు సేకరించినట్లు రిజర్వ్‌బ్యాంకు ప్రకటించింది. అంటే గత ఏడాది 12 నెలల్లో తీసుకున్న రుణంలో 50 శాతానికికన్నా ఎక్కువగా ఈ ఏడాది జూలై వరకు తీసుకున్నట్లు ఆర్‌బిఐ లెక్కల ద్వారా తేలింది. అత్యధికంగా ఈ రుణాలను ఉపయోగించుకున్న రాష్ట్రాల్లో తమిళనాడు రెండో స్థానంలో ఉండగా, పంజాబ్ 25,500 కోట్లతో మూడో స్థానంలో ఉండగా, మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ 21వేల కోట్లతో నాలుగో స్థానంలో ఉన్నాయి.

రూ.70 కోట్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- ఎపి పిటిడి ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో సిసిఎస్ సొసైటీకి చెల్లించకుండా సుమారు రూ.70 కోట్లు పెండింగ్ పెట్టారని, వెంటనే వడ్డీతోపాటు పెండింగ్ మొత్తాన్ని కూడా ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండులో ఎపిఎస్‌ఆర్‌టిసి క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ (సిసిఎస్)కి చెందిన డెలిగేట్లతో శనివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడ బస్టాండులో సిసిఎస్ ఎంక్వైరీ కౌంటర్ గతంలో మాదిరి ఏర్పాటు చేయాలన్నారు. సిసిఎస్ మేనేజింగ్ కమిటీ గతంలో జరిగిన సిసిఎస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగులకు షూరిటీలు లేకుండా రుణాలు మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న లోన్లతో పాటు కొత్తగా వాహనాలు కొనుగోలుకు రుణాలిస్తామన్న హామీ మేరకు రుణాలు మంజూరు చేయాలని అన్నారు. అన్ని జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లలో కో-ఆపరేటివ్ డిపార్టు మెంటల్ స్టోర్స్ ఏర్పాటుచేస్తామన్న హామీలను అమలు చేసేలా పాలకమండలి సభ్యులపై ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఇయు నాయకులు మందపాటి శంకరరావు, ఎస్‌కె మొహిద్దీన్, ఎస్‌ఎస్ నారాయణ, చక్రవర్తి, విజయవాడ జోనల్ కార్యదర్శి వై శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు కోసూరి సురేంద్ర, పాలకమండలి మాజీ సభ్యులు బాషా, మల్లయ్య, సిసిఎస్ డెలిగేట్లు పాల్గొన్నారు.

బహుముఖ ప్రణాళికలతో గంజాయి రవాణా కట్టడి

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోపీనాథ్ జట్టి, పక్కన మహేశ్వరరెడ్డి

బహుముఖ ప్రణాళికలతో గంజాయి అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని విశాఖ రేంజ్ డిఐజిగా గోపీనాథ్ జట్టి అన్నారు. శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డితో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు అధికంగా ఉందని, 13 మండలాలను గుర్తించి గత మూడేళ్లలో పదివేల ఎకరాల పంటను నిర్వీర్యం చేశామన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేశామని తెలిపారు. ఒడిశా రాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో రవాణా జరిగే అవకాశం ఉందని చెప్పారు. దీనిపై ఇరు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే ఆయా బృందాల ద్వారా కొంతమందిని గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. ఆంధ్ర - ఒడిశా సరిహద్దుల్లో రేంజ్ పరిధిలో మావోయిస్టుల ప్రభావం ప్రస్తుతానికి ఏమీ లేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. శ్రీకాకుళం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సైబర్ నేరాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, ఆకర్షణీయ ప్రకటనలకులోనై అధిక మొత్తంలో నగదు కోల్పోతున్నారని వివరించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అన్నవరం టూ హైదరాబాద్

- హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్
- 2.3కిలోల హాష్ ఆయిల్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం
- మరోచోట చాక్లెట్స్‌గా గంజాయి సరఫరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నవరం నుంచి హైదరాబాద్‌కు హాష్ ఆయిల్‌ను సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని నలుగురిని ఎల్‌బినగర్ ఎస్‌ఒటి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 2.3 కిలోల హాష్ ఆయిల్, ఐదు సెల్‌ఫోన్లతోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎల్బీనగర్ సిపి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపి సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. సైదాబాద్ టెలికాం క్వార్టర్స్‌లో నివాసముంటున్న వి.రంజిత్‌కుమార్, మీర్‌పేట్ తిరుమళా ఎన్‌క్లేవ్‌కు చెందిన బి.సాయి నితిన్, బి.నరేంద్ర, ఎల్‌బినగర్‌కు చెందిన బి.సాయి కృష్ణ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈ క్రమంలో విశాఖపట్నం వెళ్లి గంజాయి, హాష్ ఆయిల్, డ్రగ్స్ దందా నిర్వహించే సాయిని కలిశారు. సాయి నుంచి హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి తిరిగి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో కొద్ది రోజుల కిందట సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. తొమ్మిది రోజుల అనంతరం బయటకు వచ్చిన తర్వాత తిరిగి హాష్ ఆయిల్ సరఫరా చేయాలని అన్నవరం వెళ్లారు. అక్కడ సాయి వద్ద ఐదు గ్రాములకు రూ.రెండు వేల చొప్పున 2700 గ్రాముల హాష్ ఆయిల్ కొనుగోలు చేశారు. గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ తీసుకొచ్చి మీర్‌పేట్‌లోని సాయి నితిన్ ఇంట్లో దాచిపెట్టారు. చిన్నచిన్న బాటిళ్లలో హాష్ ఆయిల్‌ను నింపి సరఫరా చేసేందుకు ప్రయత్నించారు. కిలో హాష్ ఆయిల్ తయారు చేయాలంటే 35 నుంచి 40 కేజీల గంజాయిని నిందితులు ఉపయోగిస్తారని సిపి తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సాయి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు.

అన్న క్యాంటీన్లకు పార్టీ రంగులపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

అన్న క్యాంటీన్ బిల్డింగులకు అధికార తెలుగుదేశం పార్టీ జెండా రంగులు వేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. 'అన్న క్యాంటీన్లతో సహా ప్రభుత్వ భవనాలకు టిడిపి జెండా రంగులు వేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పసుపు, ఎరుపు రంగులను వాడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు' అని ఎపి ఎన్‌జిఒల సంఘం పూర్వ అధ్యక్షులు నలమారు చంద్రశేఖర్ రెడ్డి పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ నిధులతో టిడిపి జెండా రంగులు వేస్తున్నారని అన్నారు. ఈ విషయం తెలిసి కూడా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు అవే రంగులు ఉపయోగించాలని యోచిస్తున్నారని చెప్పారు. సిఎం చంద్రబాబు, మంత్రి పి నారాయణ మౌఖిక ఆదేశాల కారణంగానే టిడిపి జెండా రంగులు వేశారన్నారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శులను ప్రతివాదులుగా చేశారు. చంద్రబాబు, నారాయణను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

ఆయుధాలను వెనక్కిప్పించండి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పుడు స్వాధీనం చేసిన తన ఆయుధాలను పోలీసులు వెనక్కివ్వడం లేదంటూ పుంగనూరు వైసిపి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో తాను పోలీసులకు స్వాధీనం చేసిన 0.32 బోర్ పిస్టోల్, 22 రివాల్వర్, డబుల్ బ్యారెల్ గన్లను వెనక్కిప్పించాలని కోరారు. ఎన్నికల తర్వాత వాటిని పోలీసులు వారి వద్దే ఉంచుకోవడం అన్యాయమన్నారు. చట్ట ప్రకారం లైసెన్స్ తీసుకుని పొందిన ఆయుధాలను తిరిగి ఇవ్వాలని పలుసార్లు కోరినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ చేయనుంది.

సిఎస్‌కె పరిశ్రమలో దెబ్బతిన్న యంత్రాలు, ముడి పదార్థాలు

చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవడానికి, పాలసీలులేని వారు కంపెనీల నిర్వహణకు అవసరమైన రుణాలు సమకూర్చుకోవడానికి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బీమా కంపెనీల వారు క్లెయిమ్‌లు, బ్యాంకర్లు రుణాలు అందిస్తే 30 నుంచి 45 రోజుల్లో పరిశ్రమలను తిరిగి తెరుస్తామని, లేకపోతే ప్రయివేటు అప్పులే దిక్కవుతాయని చెప్తున్నారు. దీంతో, అప్పుల భారం పెరగడంతోపాటు పరిశ్రమలు తెరవడానికి రెండు నెలలకుపైగా సమయం పడుతుందని పరిశ్రమల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

కార్మికులపై ప్రభావం

విజయవాడ ఊర్మిళా నగర్, ఏకలవ్య నగర్ తదితర ప్రాంతాలకు చెందిన 1500 మంది కబేళా ప్రాంతంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలు దెబ్బతినడంతో ఆ కార్మికులకు ఉపాధి పోయింది. ప్రస్తుతం కేవలం పరిశ్రమల క్లీనింగ్‌కు 500 మంది కార్మికులను మాత్రమే పిలుస్తున్నారు. మిగిలిన వెయ్యి మంది కార్మికులకు పనిలేకుండా పోయింది. పరిశ్రమలు ఉత్పత్తులు ప్రారంభిస్తేగానీ వారికి పూర్తి స్థాయిలో పనులు కల్పించలేమని పరిశ్రమల యజమానులు చెబుతున్నారు.

పంట భూముల్లో సెజ్!

- ఆందోళనలో రైతులు
- స్టీల్‌ప్లాంట్ భూములకూ ఎసరు!

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

'పండించిందే తింటున్నాం. భూమిపోతే ఎక్కడకు పోతాం. ఎలా బతుకుతాం. ఏమి తింటాం' అని కె.కోటపాడు మండలంలోని నూతన సెజ్ ప్రతిపాదిత గ్రామాల రైతులు వాపోతున్నారు. తరతరాలుగా భూమిని నమ్ముకొని బతుకుతున్న పేద, చిన్న రైతు కుటుంబాల్లో అక్కడ సెజ్ ప్రతిపాదన తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది. అనకాపల్లి జిల్లా వి.మాడుగుల నియోజకవర్గ పరిధిలోని కె.కోటపాడు మండలం ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి, గుల్లేపల్లి, కింతాడ, గొండిపాలెంలో 1392 ఎకరాల్లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ విజయకృష్ణన్ ప్రతిపాదిత సెజ్ భూముల పరిశీలనకు వెళ్లినప్పుడు రైతులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. తమ భూములను ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. సెజ్‌కు భూములు ఇచ్చేందుకు రైతులను ఒప్పించే పని అధికార పార్టీ నాయకులకు ప్రభుత్వం అప్పగించింది. రైతులు వ్యతిరేకించకుండా ఉండేందుకు ప్రస్తుతం డి-పట్టా భూములు 1,392 ఎకరాల్లో సెజ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆ తర్వాత జిరాయితీ భూములనూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) సేకరించనున్నట్లు సమాచారం. ఆర్లి రెవెన్యూలో 132 ఎకరాలు, గుల్లేపల్లిలో 33 ఎకరాలు, కింతాడలో 203 ఎకరాలు, గొండిపాలెంలో 53 ఎకరాలు, గరుగుబిల్లిలో 137 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు అనేక సంవత్సరాల క్రితం 404 మంది పేదలకు ఇచ్చిన 834 ఎకరాల భూమినీ సెజ్‌కు తీసుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఆర్లి రెవెన్యూలోని విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 700 ఎకరాల్లో 300 ఎకరాలను కూడా సెజ్‌కు తీసుకొని, ఆ భూమికి బదులు వేరేచోట భూమి ఇచ్చేలా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి ఒప్పించాలని భావిస్తున్నారు. సెజ్‌కు ప్రతిపాదించిన భూముల్లో రైతులు మామిడి, జీడి తోటలు సాగు చేస్తున్నారు. ఆర్లి పంచాయతీ చింతపాలెంలో ఎకరా నుంచి ఐదెకరాల భూమి కలిగిన చిన్న రైతులు ఉన్నారు. వరి, చెరుకు, వేరుశనగ, మామిడి, జీడి తోటలను వర్షాధారంగా సాగుచేసుకొంటూ జీవనోపాధి పొందుతున్నారు. నాలుగు వైపులా కొండల మధ్య పచ్చని పొలాలు, తోటలు, స్వచ్ఛమైన గాలి, పశు సంపదతో జీవనం సాగిస్తున్న చింతపాలెం ప్రజలు తమ భూములుపోతే ఎలా బతుకుతామని ప్రశ్నిస్తున్నారు. సెజ్ ప్రతిపాదిత గ్రామాల ప్రజలకు సమాచారం ఇవ్వకుండా రహస్యంగా పరిశీలించడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు మాత్రం సెజ్‌కు భూముల ప్రతిపాదన ప్రాథమిక దశలోనే ఉందని చెబుతున్నారు.

సెజ్ ప్రతిపాదిత చింతపాలెం భూములు

భూములుపోతే ఎలా బతుకుతాం

రెండెకరాల సొంతభూమి ఉంది. చెరుకు, వరి, వేరుశనగ, మిరప పండిస్తున్నాం. ఒక పంట తరువాత ఇంకొక పంట వేసుకొని బతుకుతున్నాం. పెట్టుబడులుపోనూ ఏడాదికి రూ.50 వేల ఆదాయం వస్తోంది. పంట భూములు ఇచ్చేసి మేమెక్కడకు పోవాలి. ఎలా బతకాలి..

-వంటాకు వెంకునాయుడు, చింతపాలెం, కోటపాడు మండలం

భూమి వదులుకోం

ఐదెకరాల సొంత పల్లపు భూమిలో మామిడి తోట, చెరుకు, వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నాను. ఎంతోకాలం నుంచి అ భూములనే నమ్ముకొని బతుకుతున్నాం. ఈ భూమి లేకపోతే మేమయిపోవాలి ? భూమి వదులుకోం.

-కసిరెడ్డి గుమ్మయ్య, చింతపాలెం

సేకరించిన ఖాళీ భూముల్లో పరిశ్రమలు పెట్టాలి

ఈ ప్రాంతంలో పేద, చిన్న రైతుల డి-పట్టా భూములు తీసుకోవాలనుకోవడం తగదు. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి ప్రాంతాల్లో సేకరించిన భూముల్లో స్థలాలు ఇంకా ఖాళీగా ఉన్నాయి. వాటిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి విద్యార్హతలు కలిగిన జిల్లాలోని యువతకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలి. పంట భూములను తీసుకోవాలన్న ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలి.

-డి.వెంకన్న, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

గురజాడ నివాసంలో ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

పాఠ్యాంశంగా గురజాడ జీవితం

- గురజాడ 162వ జయంత్యుత్సవంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ వెంకట అప్పారావు జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చి, ఆయన గొప్పదనాన్ని నేటి తరానికి తెలియజేయాల్సి ఉందని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రతి పాఠశాలలో గురజాడ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నవయుగ వైతాళికులు గురజాడ 162వ జయంతోత్సవం విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జరిగింది. ముందుగా కలెక్టరేట్‌లోని గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను మంత్రి తిలకించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... గురజాడ రచనలు ఇప్పటికే పాఠ్యపుస్తకాల్లో ఉన్నాయని, ఆ మహనీయుని జీవిత చరిత్ర కూడా చేర్చడం ద్వారా విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. సామాజిక స్పృహతో రచనలు చేసిన గురజాడ పేరుతో స్ఫూర్తి అవార్డును ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే పి. అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ.. మహాకవి గురజాడ చిరస్మరణీయులన్నారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ.. గురజాడ రచనలు నిత్య నూతనమని, అందరికీ ఆయన స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు, కళాకారులను సత్కరించారు. అంతకుముందు గురజాడ స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి జయంతి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, గురజాడ కుటుంబ సభ్యులు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేశలి అప్పారావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, సాహితీ సంస్థల ప్రముఖులు, కళాకారులు కలిసి గురజాడ కూడలి వద్దకు ప్రదర్శనగా చేరుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

కూలీలపై కందిరీగల దాడి

- ఇద్దరు మృతి
- మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- రణస్థలం/రూరల్ (శ్రీకాకుళం జిల్లా

రమణమ్మ, సూరి కిష్టప్పడు (ఫైల్)

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం లంకపేటలో విషాదం చోటు చేసుకుంది. కూలీలపై కందిరీగలు దాడి చేయడంతో ఇద్దరు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానిక కూలీల సమాచారం మేరకు.. లంకపేటకు చెందిన కూలీలు కిల్లారి రమణమ్మ (60), కిల్లారి సూరి కిష్టప్పడు (70), బోంతు కాంతమ్మ, ఇప్పిలి శ్రీరాములు మరి కొంతమంది కలిసి ఓ రైతు పొలంలో పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో ఒక్కసారిగా కందిరీగలు దాడి చేశాయి. గాయపడిన నలుగురిని తొలుత కొండములగాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు, మెరుగైన వైద్యం కోసం ఆ తర్వాత జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిల్లారి రమణమ్మ, కిల్లారి సూరి కిష్టప్పడు మరణించారు. బొంతు కాంతమ్మ, ఇప్పిలి శ్రీరాములు చికిత్స పొందుతున్నారు. రమణమ్మకు భర్త, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు, సూరి కిష్టప్పడుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వరదలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- తక్షణమే అఖిలపక్షం కమిటీ సమావేశం నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి-విజయవాడ

భారీ వరదలకు ప్రజలు నిండా మునిగి, సర్వం కోల్పోవడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల సిహెచ్ బాబూరావు అన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. బుడమేరు, కృష్ణా నది వరద ఉధృతికి విజయవాడ సగ భాగం మునిగిపోయిందని, ప్రజలు సర్వం కోల్పోయారని తెలిపారు. వరదను అంచనా వేయకపోవడం, ప్రమాద హెచ్చరికను ప్రజలకు తెలియచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల వైఫల్యమే కారణమని పేర్కొన్నారు. ఇటువంటి ఘోర విపత్తుపై చర్చించి, వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు అన్ని రాజకీయపక్షాలు, ప్రజాసంఘాల నేతలతో తక్షణమే సమావేశం నిర్వహించి, వారందరూ చెప్పే అంశాలను పరిగణనలోకి తీసుకుని బాధితులకు పరిహారం చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 6,880 కోట్ల మేర సహాయం కోరినా కేంద్ర ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. బుడమేరు వరదకు ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.పది లక్షలకుపైగా ఆస్తి నష్టం జరిగిందని, వ్యాపారాలకు, పరిశ్రమలకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ నష్టంతో పోల్చితే ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ చాలా పరిమితమని అన్నారు. గ్రౌండ్‌ఫ్లోర్ వారికి రూ.25 వేలు, మొదటి అంతస్తు వారికి రూ.పది వేలు ప్యాకేజీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కనీసం రూ.50 వేలు ఇవ్వాలని, దెబ్బతిన్న ఆటోకు రూ.25 వేలు, ద్విచక్ర వాహనానికి రూ.పది వేలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న కార్లకు తగిన సాయంతోపాటు చిరు వ్యాపారస్తులకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని కోరారు. వరద బాధితులకు సిపిఎం అన్ని విధాలుగా అండగా నిలిచిందని, బాధితులను కాపాడటంలోనూ, వారికి భోజనాలు సరఫరా చేయడంలోనూ సిపిఎం నాయకులు, కార్యకర్తలు ముందున్నారని తెలిపారు. విజయవాడ నగరంతో పాటు కొండపల్లి, ఇతర ప్రాంతాల్లో 12 కేంద్రాల ద్వారా 15 రోజుల పాటు లక్షా 59 వేల మందికి భోజనాలు వడ్డించారని, ఒక్క విజయవాడలోనే లక్షా 40 వేల మందికి భోజనాలు అందించినట్లు తెలిపారు. మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, అధికారుల మధ్య లోపించిన సమన్వయం కారణంగా క్షేత్ర స్థాయిలో వరద బాధితులను ఆదు కోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.

గీత వృత్తిని నిర్వీర్యం చేయొద్దు

- ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూడకుండా లక్షల మంది గీత కార్మికులకు జీవనాధారంగా ఉన్న కల్లుగీత వృత్తిని ఆధునీకరించాలని ప్రభుత్వాన్ని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా గీత కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. గీత కుటుంబాలకు ఉపాధి పెంచే విధంగా నూతన కల్లు విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. దహన సంస్కారాలకు రూ.30 వేలు, గాయపడిన వారి వైద్య ఖర్చులకు రూ.25 వేలు కార్పొరేషన్ ద్వారా ఇవ్వాలని, వృత్తిదారులకు ద్విచక్ర మోటార్ సైకిల్ ఇవ్వాలని కోరారు. తాటిచెట్టు ద్వారా 200 రకాల ఉత్పత్తులను తయారు చేయొచ్చని, తాటి బెల్లం, ఫామ్ డ్రింక్స్, సర్ఫ్ వంటి అనేక బై ప్రొడక్ట్స్ తయారు చేయొచ్చనే సైంటిస్టుల సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ నియామకాల ప్రక్రియ వెంటనే చేపట్టాలి

- కాకినాడ కలెక్టరేట్ వద్ద నిరుద్యోగ యువత ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను వెంటనే చేపట్టాలని, హోంగార్డుల పోస్టుల రిజర్వేషన్ల కేసును తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ కలెక్టరేట్ ఎదుట కానిస్టేబుల్ అభ్యర్థులు, నిరుద్యోగులు, కళాశాల విద్యార్థులు ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని జెడ్‌పి సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలని, దేహదారుఢ్య, మెయిన్ రాత పరీక్షలు నిర్వహించాలని పెద్ద ఎత్తున నినదించారు. ఈ ధర్నానుద్దేశించి డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడారు. గత ప్రభుత్వం 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందని, ఈ మేరకు ప్రిలిమ్స్ రాత పరీక్షను కూడా నిర్వహించిందని తెలిపారు. క్వాలిఫై అయిన అభ్యర్థులకు నేటికీ దేహదారుఢ్య పరీక్షలు, మెయిన్స్ రాత పరీక్షలు నిర్వహించలేదన్నారు. ఈ నోటిఫికేషన్‌లో హోంగార్డుల రిజర్వేషన్లను సివిల్ పోలీసుల కేటగిరీలో ఎనిమిది నుంచి 15 శాతం, ఎపిఎస్‌పి కేటగిరీలో 15 నుంచి 25 శాతానికి పెంచారని, దీంతో కొంత మంది కోర్టుకు వెళ్లగా హోం గార్డులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. ఈ తీర్పుతో స్పెషల్ రిజర్వేషన్లకు కేటాయించిన పోస్టుల్లో మిగిలిన పోస్టులు జనరల్ అభ్యర్థులతో భర్తీ చేసే వీలు లేదన్నారు. హోంగార్డులకు రిజర్వేషన్లు పెంచడంతో జనరల్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దీనిపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తోందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం కూడా వాయిదాలకు హాజరు కాకుండా కేసును గాలికొదిలేసిందన్నారు. 'యువగళం' పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జెసి రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కో-కన్వీనర్ పాండవులు దుర్గాప్రసాద్, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార ధరల్లో ఆకస్మిక పెరుగుదల ప్రమాదం

- ప్రపంచ దేశాల్లో మందగమనం
- ఆర్‌బిఐ బులిటెన్ వెల్లడి

న్యూఢిల్లీ : ఆహార ధరల్లో ఆకస్మిక పెరుగుదల ప్రమాదకరమని రిజర్వ్ బ్యాంక్ ఇండియా (ఆర్‌బిఐ) సెప్టెంబర్ బులిటెన్‌లో తెలిపింది. వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 4 శాతం దిగువన ఉన్నప్పటికీ.. ఆహార ధరల్లో అస్థిరత ఇబ్బందులను కలిగిస్తుందని పేర్కొంది. స్టేట్ ఆఫ్ ది ఎకానమీ శీర్షికతో ప్రచురించిన కథనం వివరాలు.. 'వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ వరుసగా రెండవ నెల ఆగస్టులోనూ 4 శాతం దిగువన చోటు చేసుకుంది. అయితే ఇటీవలి అనుభవాల దృష్ట్యా ఆహార ధరల అస్థిరత అనేది ఆకస్మిక ప్రమాదంగా మారింది." అని పేర్కొంది. ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ మైఖెల్ పాత్ర, ఇతర సెంట్రల్ బ్యాంక్ అధికారులు ఈ రిపోర్ట్‌ను రాశారు. ఆగస్ట్ ద్రవ్యోల్బణం 5బేసిస్ పాయింట్లు పెరిగినప్పటికీ ఇది స్వల్పమే.. దాదాపు ఇంతక్రితం నెల స్థాయిలోనే ఉందన్నారు.

ఈ ఏడాది ఆగస్టులో సిపిఐ 3.7 శాతంగా ఉంది. ఇంతక్రితం జులైలో 3.6 శాతంగా చోటు చేసుకుంది. సిపిఐని 4 శాతం దిగువన కట్టడి చేయాలని ఆర్‌బిఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఆగస్టులో వినియోగదారుల ఇంధన ద్రవ్యోల్బణం సూచీలో 34 బేసిస్ పాయింట్లు, అహార, ఇంధనయేతర ద్రవ్యోల్బణంలో 27 బేసిస్ పాయింట్ల పెరుగుదల చోటు చేసుకుంది. కాగా అహార ద్రవ్యోల్బణం సూచీ 5.3 శాతానికి పెరిగింది. జులైలో 5.1 శాతంగా నమోదయ్యిందని ఆర్‌బిఐ కథనం పేర్కొంది.

అధికారులకు సవాల్..

ద్రవ్యోల్బణం తగ్గుతున్నప్పటికీ.. ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నాయని ఆర్‌బిఐ బులిటెన్ పేర్కొంది. ఇది ద్రవ్య విధాన అధికారులకు సవాల్‌గా నిలుస్తుంది. కాగా భారత్‌లో ప్రయివేటు వినియోగం, స్థూల స్థిర పెట్టుబడులు బలంగా ఉన్నాయి. 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో నికర ఎగుమతులు భారత జిడిపికి మద్దతునిచ్చాయి. కాగా.. ఆ త్రైమాసికంలో జిడిపి 6.7 శాతానికి పరిమితమై ఐదు త్రైమాసికాల కనిష్టానికి పడిపోయింది. దీనికి వ్యవసాయం, ప్రభుత్వ వ్యయం, సేవలలో వృద్ధి మందగించడమే ప్రధాన కారణం.

"ఇప్పటికే గ్రామీణ డిమాండ్ పునరుద్ధరణతో ప్రధాన ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టింది. 2024 జులై - సెప్టెంబర్ త్రైమాసికంలో గృహ వినియోగం పెరగడానికి సిద్ధంగా ఉంది. ఎఫ్ఎంసిజి రంగం డిమాండ్‌లోనూ పెరుగుదల చోటు చేసుకుంటుంది. పండుగ సీజన్‌కు ముందు ఇ-కామర్స్ సంస్థలు భారీగా చేపడుతున్న నియామకాలతో మెట్రో నగరాల్లోనే కాకుండా.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ వినియోగం పెరగనుంది." అని ఆర్‌బిఐ బులిటెన్ పేర్కొంది.

కలెక్టర్ వద్ద ధర్నా చేస్తున్న నేతలు

శశికుమార్‌ను శిక్షించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులోని స్వామి దయానంద సరస్వతి బాలికల వసతి గృహంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వార్డెన్ ఫణిశ్రీ, ఆమె భర్త శశికుమార్, కేర్‌టేకర్ లావణ్యలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ప్రజాసంఘాల నేతలు శనివారం ధర్నా నిర్వహించారు. ఆశ్రమం వసతి గృహంలోని బాలికలకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో సీట్లు కల్పించాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. శశికుమార్ అకృత్యాలను ఎండగట్టారు. వసతి కల్పన పేరుతో పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. అక్రమంగా వసతి గృహం నడుస్తున్నా ప్రభుత్వ యంత్రాంగానికి తెలియకపోవడం దారుణమన్నారు. ఆ వసతి గృహాన్ని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవా లని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని, బాధితులైన విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్లోనే వసతి కల్పించాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని మాట్లాడుతూ విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మూడవ బోటు వెలికితీత

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద అడ్డుపడిన మూడవ పడవను ఎట్టకేలకు అధికారులు శనివారం తొలగించారు. ఇనుప గడ్డర్లతో ఇప్పటికే రెండు పడవలను వెలికితీశారు. 40 టన్నుల బరువున్న ఈ మూడవ పడవ బ్యారేజీ 69వ గేటు వద్ద ఢీకొని అడ్డుగా మారింది. దీనిని పున్నమి ఘాట్ వద్దకు తరలించేందుకు ఇంజనీర్లు ఏర్పాట్లు చేశారు. మరోవైపు నాలుగో పడవ కూడా ఉన్నట్టు జలవనరుల శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలులో ఫ్లెక్సీల వివాదం

- తొలగించిన మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలోకి వస్తారన్న నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు బాలినేని శ్రీనివాసరెడ్డికి స్వాగతం పలుకుతూ ఒంగోలులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదానికి దారితీశాయి. 'జనసేన పార్టీలో చేరబోతున్న ప్రకాశం జిల్లా మెగాస్టార్ వాసన్నకు శుభాకాంక్షలు' అంటూ మెగా ఫ్యాన్స్ పేరు మీద కొంతమంది యువకులు చర్చి సెంటర్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఫొటోతో పాటు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఫొటోలు కూడా వేశారు. జనార్ధన్ ఫొటో ఉండడంతో తెలుగు యువత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బందికి చెప్పి.. ఆ ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ.. బాలినేని శ్రీనివాసరెడ్డి గత ప్రభుత్వంలో తమను ఇబ్బందులకు గురిచేశారని, తమ మీద కేసులు పెట్టి, రౌడీషీట్లు తెరిపించారని, టిడిపి నాయకులను, కార్యకర్తలను హీనంగా చూసి, వేధింపులకు గురిచేశారని, తమ మీద దాడులు చేయించారని ఆరోపించారు. అలాంటి బాలినేని శ్రీనివాసరెడ్డిని జనసేనలో ఎలా చేర్చుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. బాలినేనిని జనసేనలోకి తీసుకుంటే ఒంగోలులో కూటమి నియమాలను పాటించాల్సిన అవసరం లేదన్నారు.

ఎస్‌బిఐ సామాజిక సేవలు బలోపేతం

- అంధుల ఎన్‌జిఒకు మద్దతు
- పాల్గొన్న ఛైర్మన్ సిఎస్ శెట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్

దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తన సామాజిక కార్యక్రమాలను మరింత బలోపేతం చేసింది. శనివారం హైదరాబాద్ పర్యటనలో ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ శెట్టి పలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంధుల ఎన్‌జిఒ దేవ్‌నర్ ఫౌండేషన్‌కు భారీ సాయం అందించారు. అదే విధంగా ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ చేపట్టిన 'అమ్మ పేరుతో ఒక్క చెట్టు' కార్యక్రమంలో ఆయన మొక్కలను నాటారు. సాయి సేవ సంఘ్‌కు ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ నిత్యవసర సరుకులను అందించింది. దేవ్‌నర్ ఫౌండేషన్‌కు రూ.51 లక్షల విలువ చేసే ఫైర్ ఫైటింగ్ సిస్టమ్, సోలార్ ఫోటోవొల్టయిక్ సిస్టమ్‌ను సిఎస్ శెట్టి అందించారు. 2055 నాటికి శూన్య ఉద్గారాలకు చేరాలని తమ బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేవ్‌నర్ ఫౌండేషన్‌కు చెందిన సాయిబాబ గౌడ్ గొప్ప సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారని శెట్టి ప్రశంసించారు. ఇలాంటి వాటికి తమ బ్యాంక్ మద్దతును అందిస్తుందన్నారు. వైద్య, విద్యా, వాతావరణ, మహిళల సాధికారతకు తమ సంస్థ ఎల్లప్పుడు మద్దతును అందిస్తుందని ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్ కుమార్ పేర్కొన్నారు.

ఎల్ఐసి ఎంఎఫ్ నుంచి మానుఫక్చరింగ్ ఫండ్

ముంబయి : ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఎల్ఐసి ఎంఎఫ్ మానుఫక్చరింగ్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ కొత్త పండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఒ)ను అక్టోబర్ 4 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు తెరుస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 11న కేటాయింపులు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ పథకాన్ని యోగేష్ పాటిల్, మహేష్ బెంద్రే నిర్వహించనున్నారు. ఈ ఎన్ఎఫ్ఒలో కనీసం రూ.5,000 పెట్టుబడిగా నిర్ణయించినట్లు యోగేష్ పాటిల్ తెలిపారు.

LIC MUTUAL FUND

భారత ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్లకు చేరొచ్చు

- ఐడిబిఐ కాపిటల్ అంచనా

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ 2032 నాటికి 10 ట్రిలియన్ డాలర్లకు చేరొచ్చని ఐడిబిఐ కాపిటల్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. దేశ జిడిపి ప్రతి 18 నెలలకు ఒక ట్రిలియన్ డాలర్లు జోడించే అవకాశం ఉందన్నారు. దీంతో ఎనిమిదేళ్లలో 10 ట్రిలియన్లకు చేరొచ్చని పేర్కొంది. మేక్ ఇన్ ఇండియా లాంటి కార్యక్రమాలు భారత్‌ను గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చనున్నాయని అంచనా వేసింది.

అమెరికాలో ఓయో విస్తరణ

న్యూఢిల్లీ : ప్రముఖ హస్పిటాలిటీ సంస్థ ఓయో తన అమెరికా కార్యకలాపాలను విస్తరించనుంది. ఇందుకోసం ప్రముఖ లాడ్జింగ్ ఫ్రాంఛైజీ, మోటల్ 6, స్టూడియో 6 బ్రాండ్లను నడుపుతున్న జి6 హాస్పిటాలిటీ సంస్థను కొనుగోలు చేయనుంది. బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ కంపెనీ నుంచి 525 మిలియన్ డాలర్ల (రూ.4300 కోట్లు)కు కొనుగోలు చేయనున్నట్లు ఓయో మాతృసంస్థ ఓర్వల్ స్టేస్ పేర్కొంది. 2019లో అమెరికాలో అడుగుపెట్టిన ఓయో ప్రస్తుతం 320కి పైగా హోటళ్లను నిర్వహిస్తోంది.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ నుంచి మయూర క్రెడిట్ కార్డ్

హైదరాబాద్ : ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ప్రీమియం మెటల్ కార్డ్ పోర్ట్‌ఫోలియోకి జోడింపుగా మయూర క్రెడిట్ కార్డ్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కార్డు తరచుగా ప్రయాణించేవారికి, వ్యాపార ప్రయాణీకులకు, అడ్వెంచర్ కోరుకునే వారికి తోడుగా నిలుస్తుందని ఆ బ్యాంక్ పేర్కొంది. దీనిపై అనేక ఆకర్షణీయ రివార్డులను అందిస్తున్నట్లు తెలిపింది.

సంపాదకీయం

రీల్స్..రీల్స్...రీల్స్!!

సోషల్ మీడియా విస్తృతమైన తర్వాత కంటెంట్ రూపం, స్వరం పూర్తిగా మారిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవితాల్లోని ప్రతి అంశంపైనా ప్రభావం చూపుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే-రాపిడ్ ఫైర్ ఫార్మెట్ ఇది. రీల్స్ తక్కువ పదాలు, ఆకర్షణీయమైన విజువల్స్, సంగీతంతో వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయి. వినోదం, విజ్ఞానం సంగతి పక్కన పెడితే, ప్రతికూలాంశాలతో కూడిన కంటెంట్ కూడా రీల్స్ పేరుతో ట్రోల్ అవుతోంది. ఎంతమందికి చేరిందన్నదే లక్ష్యంగా రీల్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. 'ప్రజలు ప్రజలను ప్రభావితం చేస్తారు. నమ్మకమైన మిత్రుని సిఫార్సు కంటే ఎక్కువగా ఏదీ ప్రజలను ప్రభావితం చేయదు' అంటారు ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా ప్రపంచంలో మునిగి తేలుతున్నారు. పక్కనున్న మనుషులతో మాట్లాడటమైనా మానేస్తారేమో కాని, రీల్స్ చూడకుండా వుండరు. రీల్స్ వీక్షకులను అంతలా తన బానిసలుగా మార్చేసుకుంటున్నాయి. 'సినిమా సినిమా సినిమా సినిమా/ ఎన్టీఆర్ ఎఎన్నార్ ఎంజీఆర్ రాజ్‌కుమార్/ ఎంతోమంది వచ్చారండీ/ అంతా సినిమా మహిమా మహిమా' అంటాడో సినీ కవి. ఇప్పుడంతా 'రీల్స్...రీల్స్...రీల్స్... సోషల్ మీడియా అంతా రీల్స్ మానియా'.

మన దేశంలో సామాజిక మాధ్యమాల యాప్‌లలో అత్యధికం విదేశీ బహుళజాతి కంపెనీలు నిర్వహిస్తున్నవే. వారికి మన నేల, మనుషులు, సమాజం, మన సంస్కృతి పట్ల పట్టింపు, బాధ్యత వుండదు. ఇక్కడి డేటాతో పాటు లాభాలు మాత్రమే వారిక్కావాలి. ఇన్‌స్టా, యూట్యూబ్ వంటివి వ్యూస్ టార్గెట్ పెట్టి డబ్బులు ఆశ చూపుతున్నాయి. ఆ టార్గెట్ రీచ్ అవడం కోసం, ఫాలోవర్స్‌ను పెంచుకోవడం కోసం యూట్యూబర్స్, రీల్స్ చేసేవారు రకరకాల విన్యాసాలకు పాల్పడుతున్నారు. ఒక్కోసారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు దేశవ్యాప్తంగా ఎన్నో జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు స్నేహితులతో కలిసి చెట్టుకు ఉరి వేసుకుంటున్నట్లు రీల్ షూట్ చేద్దామనుకున్నాడు. మెడకు కట్టిన తాడు బిగుసుకుపోయి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. 19ఏళ్ల యువకుడు లక్నో మున్సిపల్ కార్పొరేషన్ వాటర్ ట్యాంక్‌లో అర్ధరాత్రి రీల్ చేస్తూ ట్యాంక్‌లో పడి మరణించాడు. ఓ తల్లి బావి అంచుపై కూర్చొని, తన చిన్నారి కొడుకు చెయ్యి పట్టుకొని బావిలోకి ఒదిలి రీల్ చేసింది. పూణెలో ఓ యువతి ఒక యువకుడి చెయ్యి పట్టుకొని భవనం పైనుంచి వంద మీటర్ల ఎత్తులో కిందికి వేలాడుతూ రీల్ చేసింది. సాహస కృత్యాలుగా భావించి చేసే పిచ్చి చేష్టలు మచ్చుకు కొన్ని మాత్రమే. కొన్ని రీల్స్ వినోదంగానూ, సృజనాత్మకంగానూ వుంటాయి. వాటిని తీసే క్రమంలో ఏమరపాటు వహిస్తే ప్రాణాలకే ప్రమాదం. సరదాగా రీల్స్ చేసేవారు కొందరైతే... దీన్నొక వ్యసనంగా మార్చుకున్నవారు మరికొందరు. ఈ వ్యసనం వారి జీవితాలను ప్రమాదపుటంచుల వరకూ తీసుకెళుతోంది. ఒక్కోసారి మృత్యుకూపంలోకి నెడుతోంది. అంతేకాదు, ఈ యాప్‌లు పదేపదే చూస్తుండటం శారీరక, మానసిక రుగ్మతలకూ కారణమౌతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 517 కోట్ల మంది సోషల్ మీడియా వినియోగదారులు వుండగా, భారత్‌లో 86.2 కోట్ల మంది ఉన్నారు. సగటు భారతీయుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రతిరోజూ 150 నిమిషాలు గడుపుతున్నాడు. సోషల్ మీడియా వినియోగంలో 107 కోట్ల మందితో చైనా మొదటి స్థానంలో వుండగా, భారత్ రెండో స్థానంలో వుంది. అయితే, 2029 నాటికి చైనా (127కోట్లు)ను రెండో స్థానంలోకి నెట్టి, భారత్ (130కోట్లు) అగ్రస్థానంలో నిలుస్తుందని అంచనా. ప్రస్తుతం యూట్యూబ్‌కు భారత్‌లో 46.2 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ఇదే అత్యధికం. ఈ ప్లాట్‌ఫామ్ హోటల్ నడుపుకునే కుమారి ఆంటీ మాదిరిగా కొందరిని రాత్రికి రాత్రే సెలబ్రిటీలను చేసేయగలదు. మరికొందరి జీవితాలను ట్రోల్ చేస్తూ భ్రష్టుపట్టించనూ గలదు. రెండంచుల ఖడ్గం వంటి సామాజిక మాధ్యమాన్ని, సాంకేతికతను విజ్ఞానాన్ని, సృజనాత్మకతను పెంపొందించుకొనే ఒక సాధనంగా వాడుకోవాలి. అంతేతప్ప అది మరణానికో, విశృంఖలతకో, ఎదుటివారిని ట్రోల్ చేయడానికో సాధనం కాకూడదు.

మంచి మాట

కార్మికవర్గ పోరాటం
వారి విముక్తి కోసమే కాదు.
అణచివేత నుంచి, దోపిడీ నుంచి
మొత్తంగా మానవాళి విముక్తి కోసం
అది పోరాడుతుంది.

- హోచిమిన్,
వియత్నాం విప్లవ సారథి.

జడ్జీల నియామకంలో అంతులేని జాప్యం

ప్రస్తుతం



తెలకపల్లి రవి

భారతదేశంలో న్యాయమూర్తుల నియామక సమస్య కేంద్రం ఏకపక్ష వైఖరి వల్ల మరొకసారి వివాదంగా మారింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు కోర్టు ఆగ్రహాన్ని వెల్లడించాయి. ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను పక్కన పెట్టడానికి కారణం ఏమిటని ఆయన కేంద్రాన్ని నిలదీశారు. కొలీజియం కేవలం సెర్చి కమిటీ లాంటిది కాదు. కొలీజియంకు రాజ్యాంగ పరమైన కొన్ని బాధ్యతలున్నాయి. దాని సిఫార్సులను ఆమోదించవచ్చు. లేదా తోసి పుచ్చవచ్చు. కానీ సిఫార్సు చేసినప్పుడు దానిపై ఏదో ఒక స్పందన చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంటుంది. వాటిపై ఎడతెగని ఆలస్యం చేసి గుండుగుత్తగా వెనక్కు పంపితే ఏమని అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ వారం మొదట్లో హైకోర్టులకు సంబంధించిన ప్రధాన న్యాయమూర్తులు పలువురిని కొలీజియం సిఫార్సు చేసింది. అంతకు ముందు చేసిన సిఫార్సులను కేంద్రం సలహా మేరకు మార్చింది కూడా. ఢిల్లీ హైకోర్టుకు జస్టిస్ సుకుమార్, సురేష్ కుమార్, పంజాబ్ హర్యానా హైకోర్టుకు జస్టిస్ శాంతాబాయి, జమ్మూ కాశ్మీర్ లడక్ హైకోర్టుకు జస్టిస్ దర్శి రాబర్ట్‌ను పంపించాలంటూ చేసిన సిఫార్సులను వెనక్కు తీసుకోవడానికి కూడా కొలీజియం సిద్ధపడింది. రెండో జడ్జిల కేసులో తీర్పు ప్రకారమైతే ఒకసారి పంపిన పేర్లను మళ్లీ పరిశీలన తర్వాత కూడా కొలీజియం పంపినట్టయితే ప్రభుత్వం తప్పనిసరిగా ఆమోదించి తీరాలి. న్యాయ వ్యవస్థతో సంబంధం ఉన్న వారు ఎవరైనా ఈ ధోరణి వ్యవస్థ స్వయం ప్రతిపత్తికి భంగకరమని భావిస్తారు. ఆ విధమైన విమర్శలు, అభ్యంతరాలు, నిరసనలు చాలానే వచ్చాయి. కొలీజియం పంపిన పేర్లపై కేంద్రం నిర్ణయం తీసుకోవడానికి నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించాలంటూ దాఖలైన పిల్ విచారణ సందర్భంగా ఈ సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. జార్ఖండ్ ప్రభుత్వం దాఖలు చేసిన ఇలాంటి మరో పిటిషన్ కూడా వచ్చింది. ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావును నియమించాలని కొలీజియం చేసిన సిఫార్సును ఎంతకూ తేల్చకపోవడంపై అది అభ్యంతరం చెప్పింది.

కేంద్రం తరపున వాదించిన అటార్నీ జనరల్ (ఎ.జి) ఆర్.వెంకట రమణి మాత్రం అసలు ఈ విషయంలో కోర్టు జోక్యం ఏ మేరకు సాధ్యమని సందేహం వెలిబుచ్చారు. దానిపై ఆగ్రహించిన సిజెఐ చంద్రచూడ్ 'అసలు ఈ నియామకాలు జరపకపోవడానికి కారణాలు ఏంటో ముందు చెప్పండి' అని ప్రశ్నించారు. తాము పంపిన సిఫార్సులలో ఒక్కొక్క దాని పరిస్థితి ఏంటో మాకు వివరాలతో సహా నివేదించండి. ఇవన్నీ చెప్పడంలో మా ఉద్దేశం తప్పులు పట్టడం కాదు. న్యాయస్థానాల పాలన నిర్వహణకు సంబంధించిన వ్యవహారాలను ముందుకు తీసుకోవడం కోసమే ఈ మాట చెప్తున్నామని సిజెఐ అటార్నీ జనరల్‌తో అన్నప్పుడు నాకు బాగా అర్థమైందని ఆయన బదులిచ్చారు. అయితే అసలు ఇలాంటి పిటిషన్ విచారణ అర్హత కలిగి వుందో లేదో తన అభిప్రాయం ఒక నోట్ రూపంలో అందజేస్తానని వ్యాఖ్యానించారు. మీరు సున్నితమైన విషయాన్ని మరి లాగకండి. కావాలంటే జార్ఖండ్ కేసు వాదిస్తున్న కపిల్ సిబల్ గారే నియామకాల ప్రక్రియ చేపట్టవచ్చు. ప్రతి సిఫార్సు అనామోదానికి ఒక ప్రత్యేక కారణం ఉంటుందంటూ కేంద్రాన్నే సమర్థించడానికి అటార్నీ జనరల్ ఆర్.వెంకట రమణి ప్రయత్నించారు. సుప్రీంకోర్టు పాత్రనే ప్రశ్నించినట్టు మాట్లాడారు.

దీర్ఘకాల సంక్షోభం

ఈ వాదోపవాదాలు యాదృచ్ఛికమైనవని భావించడం కష్టం. దీర్ఘకాలంగా తేలని కొలీజియం, కేంద్రం సంబంధాల సమస్య దీంతో ముడిపడి ఉంది. ఉదయం కేసు ప్రారంభం కాగానే ఎ.జి. వెంకట రమణి వాయిదా వేయాలని కోరారు. ఈ విషయంలో 2018 నాటి నుంచి విచారణకు నోచని పిటిషన్‌లు కూడా వున్నాయని అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ గుర్తు చేశారు. జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియామకంపై పిటిషన్ దాఖలు చేసిన విషయం తనకు తెలియదని ఎ.జి చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు కీలకమైన పాలనా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. దాన్ని వాయిదా వేస్తూ తాత్కాలిక సిజెతో నడిపించడం సమస్యలకు దారితీస్తుందన్నారు. నిర్ణీత కాలం లోగా కొలీజియం సిఫారసులను ఆమోదించకపోతే ఆ నియామకాలు జరిగిపోయినట్టే భావించాలని ఈ సందర్భంగా ప్రశాంత్ భూషణ్ సూచించారు. నిజానికి రెండవ జడ్జీల కేసుగా పేరు పొందిన కేసులో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులు గనక రెండోసారి పంపినట్టయితే ప్రభుత్వం ఆమోదించి తీరాలని ఆదేశిస్తున్నది. మళ్లీ మళ్లీ పంపిన పేర్లను కూడా విస్మరించటం, తిరగ్గొట్టడం రెండవ జడ్జీల కేసు తీర్పు స్ఫూర్తికి విరుద్ధమని డిసెంబర్ 2022లో ఇచ్చిన ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పుడైతే ఢిల్లీ హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, కేరళ, మధ్యప్రదేశ్, మద్రాస్, మేఘాలయ హైకోర్టులకు జడ్జిలను నియమించవలసి వుంది. ఢిల్లీ హైకోర్టులో సౌరభ్ కిర్పాల్ నియామకం దీర్ఘకాలంగా పక్కన పెట్టారని అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ వాదించారు. ఇలా తొక్కిపట్టిన 12 పేర్లను తాను పిటిషన్‌లో ఉదహరించానని ప్రశాంత్ భూషణ్ అన్నారు. తనను గనక నియమించి ఉంటే భారతదేశంలో మొదటి గే జడ్జి ఉండేవారు. అతని పేరును ఢిల్లీ హైకోర్టు కొలీజియం 2017ల్లో పంపించింది. కొలీజియం 2021 నవంబర్‌లో సిఫార్సు చేసింది. 2023 జనవరిలో మరోసారి చెప్పింది. కానీ స్వలింగ సంపర్కుల హక్కులను గట్టిగా వాదించే కిర్పాల్ నియామకానికి కేంద్రం అభ్యంతరం పెట్టింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా జాన్ సత్యంను సుప్రీంకోర్టు కొలీజియం 2022 ఫిబ్రవరిలో సిఫార్సు చేసింది. 2023 జనవరిలో పునరుద్ఘాటించింది. అయినప్పటికీ ఇవి జరగలేదు. జార్ఖండ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. సారంగి పేరును ఆలస్యంగా ఖరారు చేయడంవల్ల ఆయన 15 రోజులు మాత్రమే సిజెగా పనిచేసి దిగిపోవాల్సి వచ్చింది!



> జడ్జిలే జడ్జిలను నియమించుకునే పద్ధతి కాకుండా అందుకు సమగ్రమైన జ్యుడిషియల్ కమిషన్ వుండాలనేది వాస్తవమే అయినా మోడీ ప్రభుత్వం ఆ పేరుతో కేవలం నియామకాలు మొత్తంగా తన చేతిలోకి తీసుకోవాలనే రీతిలో వ్యవహరించడం సరైంది కాదు. సమగ్ర సంస్కరణలతో కూడిన కమిషన్ కాకుండా తనకు నచ్చిన విధంగా ఆ కమిషన్‌ను రూపొందించాలనుకోవడం అవాంఛనీయం. దీనికి తోడు ప్రధాని మోడీ, మంత్రులూ తరచూ న్యాయ వ్యవస్థపై చేసే వ్యాఖ్యలు దాన్ని మరింత పెంచాయి. ఇక ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆ పదవి పరంగానూ, రాజ్యసభ చైర్మన్ హోదాలో కూడా నేరుగా కోర్టులను సవాలు చేసేటట్టు మాట్లాడుతుంటారు. ఒక సందర్భంలో ఆయన మాటలను కోర్టు ధర్మాసనం దాదాపు సూటిగానే ఖండించింది. అయినా ఇటీవల కూడా సిబిఐపై, ఎన్నికల సంఘంపై వ్యాఖ్యానాలు చేయకూడదని ఆయన సెలవిచ్చారు. మొత్తంపైన అటూ ఇటూ వాదనలు ఎలా వున్నా న్యాయమూర్తుల నియామకంలో జాప్యం, కేంద్రం జోక్యం వంటి అనేక విమర్శలు, అనుభవాల రీత్యా న్యాయ వ్యవస్థ స్వతంత్రతనూ ప్రజాస్వామిక నియామక ప్రక్రియనూ సమతుల్యం చేయడం చాలా అవసరమనేది నిర్వివాదాంశం.

రాజకీయ అభ్యంతరాలా?

ఇంతకంటే తీవ్రమైనవి రాజకీయ ఆటంకాలు. 2024 ప్రారంభంలో కొలీజియం పి.ఎం. మాధవన్‌ను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక చేస్తే కేంద్రం అడ్డుపడింది. ఆయన సిపిఎం అభిమాని అనీ, రెండుసార్లు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆయనను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించిందనీ సిఫార్సు వెనక్కు పంపింది. అయితే ఆయన సిపిఎం అభిమాని అనే వాదన అస్పష్టమైందని కొలీజియం మార్చి 13న బదులిచ్చింది. ఫలానా రాజకీయ నేపథ్యంతో వున్నారనే ఒక్క కారణంగా అన్ని సందర్భాల్లో వారి నియామకాన్ని తిరస్కరించలేమని పేర్కొంది. లంకేశ్ చంద్రగౌరి బిజెపి లో ఆఫీసు బేరర్‌గా వున్నా 2023 ఫిబ్రవరిలో ఆమెను మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా నియమించిన సందర్భాన్ని పేరు తీయకుండా కొలీజియం గుర్తుచేసింది. నిజానికి గౌరి చేసిన కొన్ని వ్యాఖ్యలు అభ్యంతరకరంగా వున్నాయి గనక నియామకం చేయ వద్దంటూ ఆమె ప్రమాణ స్వీకారానికి ముందే సుప్రీం కోర్టుకు అనేక లిఖిత అభ్యంతరాలు వెళ్లినా కొలీజియం ఖాతరు చేయలేదు. ఆ విధంగా చూస్తే ఎస్.సి వర్గానికి చెందిన మాధవన్ 35 మంచి తీర్పులు ఇచ్చారని కొలీజియం స్పష్టం చేసింది, పేర్కొంది. పైగా ఆయన ప్రభుత్వం ఒక పక్షంగా వుండే కేసుల ద్వారా భిన్న సందర్భాలలో ఎలా వ్యవహరించాలో కూడా అనుభవం గడించి వుంటారని అభిప్రాయపడింది. కేరళ హైకోర్టులో ఆయనతో పాటు పనిచేసిన జడ్జిలు మాధవన్ సమర్థత గురించి సంతృప్తి వెలిబుచ్చారని కూడా తెల్పింది.

హైకోర్టులకు సంబంధించినంత వరకూ కొలీజియం కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో నుంచి నివేదికలు వచ్చిన తర్వాత మాత్రమే తనకు అందిన ప్యానళ్ల నుంచి పేర్లను షార్ట్ లిస్ట్ ఎంపిక చేస్తుంది. వాటిపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి. అప్పుడు కొలీజియం వాటితో ఏకీభవించడం లేదా పునరుద్ఘాటించడం చేస్తుంది. ఏ కారణం లేకుండా ఆలస్యం చేయడమేమిటనేది ఇక్కడ సుప్రీం కోర్టు బెంచి ప్రశ్న.

ఒత్తిడి అవాంఛనీయం

వేర్వేరు హైకోర్టులకు అదే విధంగా సుప్రీంకోర్టుకు నియామకాలు చేసే సమయంలో ఇలాంటి చాలా ప్రశ్నలు అడ్డం రావడం ఇటీవల బాగా పెరిగింది. సుప్రీంకోర్టుకు ఒరిస్సా మాజీ సిజె జస్టిస్ మురళీధరన్‌ను ఒకటికి రెండుసార్లు సిఫార్సు చేసినా ఆమోదించకపోవడం ఇలాంటి వాటిలో బాగా విమర్శకు గురైంది. ఎన్ని అర్హతలున్నా తనను సుప్రీం కోర్టుకు రానివ్వకుండానే పదవీ విరమణ చేయించడం ఉద్దేశపూర్వకమేనని న్యాయ వర్గాలు నిర్ధారిస్తున్నాయి. 1982లో ఎస్.పి గుప్తాకు సంబంధించిన మొదటి జడ్జిల కేసు, 1993లో సుప్రీంకోర్టు అన్ రికార్డ్ అడ్వకేట్ల కేసు, 1998లలో మూడవ జడ్జిల కేసు వీటన్నిటిలోనూ అత్యున్నత న్యాయస్థానం తన వైఖరిని చెబుతూ వస్తున్నది. 2014లో నేషనల్ జ్యుడిషియల్ అపాయింట్‌మెంట్ల కేసులో జ్యుడిషియల్ కమిషన్ నియామకాన్ని కోర్టు నిలిపేసింది. జడ్జిలే జడ్జిలను నియమించుకునే పద్ధతి కాకుండా అందుకు సమగ్రమైన జ్యుడిషియల్ కమిషన్ వుండాలనేది వాస్తవమే అయినా మోడీ ప్రభుత్వం ఆ పేరుతో కేవలం నియామకాలు మొత్తంగా తన చేతిలోకి తీసుకోవాలనే రీతిలో వ్యవహరించడం సరైంది కాదు. సమగ్ర సంస్కరణలతో కూడిన కమిషన్ కాకుండా తనకు నచ్చిన విధంగా ఆ కమిషన్‌ను రూపొందించాలనుకోవడం అవాంఛనీయం. దీనికి తోడు ప్రధాని మోడీ, మంత్రులూ తరచూ న్యాయ వ్యవస్థపై చేసే వ్యాఖ్యలు దాన్ని మరింత పెంచాయి. ఇక ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆ పదవి పరంగానూ, రాజ్యసభ చైర్మన్ హోదాలో కూడా నేరుగా కోర్టులను సవాలు చేసేటట్టు మాట్లాడుతుంటారు. ఒక సందర్భంలో ఆయన మాటలను కోర్టు ధర్మాసనం దాదాపు సూటిగానే ఖండించింది. అయినా ఇటీవల కూడా సిబిఐపై, ఎన్నికల సంఘంపై వ్యాఖ్యానాలు చేయకూడదని ఆయన సెలవిచ్చారు. మొత్తంపైన అటూ ఇటూ వాదనలు ఎలా వున్నా న్యాయమూర్తుల నియామకంలో జాప్యం, కేంద్రం జోక్యం వంటి అనేక విమర్శలు, అనుభవాల రీత్యా న్యాయ వ్యవస్థ స్వతంత్రతనూ ప్రజాస్వామిక నియామక ప్రక్రియనూ సమతుల్యం చేయడం చాలా అవసరమనేది నిర్వివాదాంశం. పైగా కేంద్రం చేసే ఎడతెగని ఆలస్యం న్యాయాన్ని మరింత అందకుండా కేసులు గుట్టలు పడటానికి కారణమవుతున్నది. మరి ప్రస్తుతం జరుగుతున్న విచారణలో మరోసారి కేంద్రం ఏం చెబుతుందో, సుప్రీం కోర్టు ఎలాంటి ఆదేశాలిస్తుందో చూద్దాం.

రైతు సంక్షేమ పథకాలు ప్రచారానికే పరిమితం

అభిప్రాయం



మంచి వ్యవసాయ ఫలసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయడంలో ప్రభుత్వం ఉదాశీనత వైఖరి పనికి రాదు. గత పది సంవత్సరాలుగా హార్టికల్చర్ హబ్‌గా రూపాంతరం చెందిన రాయలసీమ జిల్లాల్లో చీడ పీడలకు శాశ్విత పరిష్కారం, సేంద్రియ సాగు, నీటి వనరులు, భూసారం, మంచి దిగుబడిపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. రాయలసీమలో వాణిజ్య పంటలైన చీనీ, బొప్పాయి, దానిమ్మ, జామ, అరటి, సపోటా, కళింగర, దోస విస్తారంగా పండిస్తున్నారు. మూడు సంవత్సరాల కిందట కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధు క్రాంతి పథకం భ్రాంతిగా మిగిలిపోయింది. తేనెటీగల పెంపకంతో ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. ఇందుకు భారీ పెట్టుబడులు అవసరం లేదు. నిర్వహణకు ఎక్కువ శ్రమించాల్సిన అవసరం లేదు. తేనె పరిశ్రమ వ్యవసాయ పనులకు అడ్డురాదు. విరామ సమయంలో చేసుకోవచ్చు. సొంత భూమి ఉండాల్సిన అవసరం లేదు. పెంచే ప్రదేశం చుట్టూ పూలు, పండ్ల తోటలుంటే చాలు. తేనెటీగల పెంపకంపై ఆసక్తి ఉన్న వారికి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ట్రైనింగ్ ఇవ్వాల్సిన అధికారులు అది మా పరిధిలోకి రాదు. మీరు ఎంటమాలజీ అధికారిని సంప్రదించండి, లేకపోతే స్థానిక హార్టికల్చర్ అధికారిని సంప్రదించండి అంటారు. రెండు సంవత్సరాల క్రితం సమర్పించిన దస్త్రాలకు సంబంధించి ఇంతరవకు అతీగతీ లేదు. ఈ సంవత్సరానికి మీకు రాయితీ రాదు. మీరు మళ్ళీ మూడు నెలల తరువాత కలవండి అని సెలవిస్తున్నారు.

ఇక సంవత్సరం పొడువునా ఉండే నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం చిన్నకారు రైతులు ఒక్కరూ లబ్ధి పొందలేదు. ఈ పథకం అధికార పార్టీ నాయకులకు, దళారులకు భోజ్యంగా తయారైంది. జిల్లాల్లో ఎవరెవరు లబ్ధి పొందారో బ్యాంకర్లు తెలియజేస్తే పథకం ఎంత లోపభూయిష్టంగా ఉందో తెలుస్తుంది. కరువు జిల్లాల్లో శీతలీకరణ గిడ్డంగులు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైనారు. నాబార్డు ద్వారా సన్నకారు రైతుల సంక్షేమాన్ని పూర్తిగా తుంగలో తొక్కారు. జిల్లా కేంద్రంలో నాబార్డ్ ఆఫీసు ఎక్కడుందో తెలుసుకోవడం సామాన్య రైతులకు తీరని వ్యధగా మారింది. రూ.ఐదు లక్షల బ్యాంకు లోన్ కోసం మూడు సంవత్సరాల ఐటి రిటర్న్స్, కోలాటరల్ సెక్యూరిటీ, లీగల్ ఒపీనియన్ అన్నీ సిద్ధం చేసుకుని లంచం ఇస్తే పని జరుగుతుంది. సప్లై చైన్ మేనేజ్‌మెంట్ అధ్వాన్నంగా ఉంది. మార్కెట్లలో దళారులదే పైచేయి. ఒక పక్క మార్కెట్‌లో బంగారం ధర ధగధగలాడుతోంది. మరోవైపు ఆ బంగారం ధరతో పోటీ పడి ఉల్లి ధర ఘాటెక్కుతోంది. అయితే అందుకు భిన్నంగా టమాటా, మిర్చి రైతుల పరిస్థితి మాత్రం దయనీయంగా తయారైంది. ఆరుగాలం కష్టపడి పండించిన టమాటా మిర్చి ధర రాక దిగాలు పడే పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. రాష్ట్రంలో పలు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఈసారి టమాటా పంట ఎక్కువ దిగుబడి ఉంది. అయితే ప్రస్తుతం టమాట రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న చందంగా తయారైంది. మార్కెట్టుకు తీసుకువచ్చిన టమాటా ధర కిలో రెండు రూపాయలకు పడిపోవడంతో అక్కడక్కడ రైతులు రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేశారు. రవాణా ఖర్చు విపరీతంగా పెరగడంతో సుదూర ప్రాంతాల్లో మార్కెట్‌కు సరుకు తరలించలేక పోతున్నారు. గత మూడు సంవత్సరాల నుండి ధరల స్థిరీకరణ అనేది లేదు. మూడు సంవత్సరాలుగా వ్యవసాయ పనులు రెట్టింపు అయ్యాయి.

ఎంతో ఆర్భాటంగా ప్రజాప్రతినిధులు ప్రారంభించిన కిసాన్ రైలు ఫోటో మ్యూజియంలో పెట్టుకోడానికి పనికొచ్చింది తప్ప ఏ ఒక్క రైతుకు పది పైసలు ఉపయోగం లేదని గ్రహించారు. కోల్డ్ స్టోరేజి యూనిట్లు, ప్యాకింగ్ యూనిట్లు, వేర్ హౌస్‌లు ఉత్పత్తి కులాలకు చెందిన రైతులకు ఒక్కటీ లేదు. జిల్లాలో మోతుబారి రైతులకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వారికి ఇచ్చారు తప్ప రైతుల సంక్షేమం పట్టలేదు. వాస్తవానికి తృణ ధాన్యాల వినియోగం గత పది సంవత్సరాలుగా దారుణంగా పడిపోయింది. ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలు, ఒరిస్సా, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలు ఆహారంగా ఉండేది. పది సంవత్సరాల కిందట 8.6 లక్షల హెక్టార్లలో తృణధాన్యాలు పండించే వారు, ఇప్పుడు కేవలం 1.86 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. ఫార్మర్స్ ఇంట్రెస్ట్ గ్రూప్ అలాగే రాష్ట్రాల మిల్లెట్ బోర్డులు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దేశంలో రెండు విడతలుగా 25 కోట్ల సాయిల్ హెల్త్ కార్డులు ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న రైతులకు ఎంతమేరకు ఉపయోగపడుతుందో తెలుస్తూనే ఉంది. గత నాలుగు సంవత్సరాలుగా ఒక్కటంటే ఒక్క భూసార పరీక్ష చేపట్టని రాష్ట్రాలు ఉన్నాయి. ప్రభుత్వం తక్షణమే మార్కెట్ వ్యవస్థను గాడిలో పెట్టి సన్నకారు రైతులు తాము పండించిన పంట నిల్వ చేసుకోవడానికి సోలార్ కోల్డ్ స్టోరేజ్, వేర్ హౌస్ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. దళారులు, బ్రోకర్ల నుంచి రైతులు నష్టపోకుండా సరుకు ఎక్కడికి రవాణా అవుతున్నది, వేలం పాటల్లో ఎవరు పాల్గొంటున్నారు, బ్రోకర్ కమిషన్ ఎంత? ధర ఎవరు నిర్ణయిస్తున్నారు? తరుగు ఎంత తీస్తున్నారు? అర్థం పర్థం లేని అన్ లోడింగ్ చార్జీలు డబుల్ సూట్‌తో రైతులు దిగాలు పడుతున్నారు. జాడే లేని పశుపోషణ, పాల వెల్లువ పథకాలను పునరుద్ధరించాలి.

- డా. ఎం.సురేష్‌బాబు,
సెల్ : 9989988912



గణపతి బప్పా ఏందయా...!

స్పెషల్

గణపతి బప్పా వచ్చాడు పోయాడు. అందరికీ సందడి, సందడి. కొందరికేమో వ్యాపారం, ఇంకొందరికి రాజకీయం. ఏమైతేనేం అందరి కోర్కెలూ తీర్చిపోయాడని చాలామంది అనుకుంటున్నారు. ఆ కోర్కెలు ఏమిటన్నవి ఎవరికి వాళ్ళకు తెలుసు.

సర్వ మతాల మధ్య సఖ్యత కోసం లోకమాన్యుడు మొదలు పెట్టిన ఈ గణపతి ఉత్సవాలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రారంభించారు. తరువాత అవి వివిధ రకాలుగా మారిపోయి ప్రస్తుత రూపాన్ని సంతరించుకున్నాయని కొందరంటే ఈ విధంగా అఘోరించాయని ఇంకొందరనొచ్చు. పదాలు వేరే కాని అర్థం ఒకటేనని గమనించాలి మనం.

రాజకీయాల్లోలా కాకుండా జమిలిగా చేసే ఈ ఉత్సవాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటారు. ఒక తలపై రూమి టోపి, ఒక తలపై గాంధి టోపి, క్యా భాయ్ అని అంటాడొకడు, ఏమోయని అంటాడొకడు అని సినారె ఎప్పుడో రాశారు. మతాలు, భాషలు వేరైనా మనమంతా భాయీ భాయీ అన్నాడు. ఈ భాయీల మధ్య చిచ్చు పెట్టేవారు కొందరైతే అన్న రామారావు లాంటి వాళ్ళు ఇంకా కొంతమంది అభ్యుదయవాదులు వారి మధ్య స్నేహాన్ని పెంచారు. విమోచన దినమా, స్వాతంత్ర్యదినమా అని పోట్లాడుకునే సమయంలోనే ఈ వినాయకచవితి వస్తుంటుంది. వినాయక నిమజ్జనానికి ఎవరికిష్టమైన పేరు వాళ్ళు పెట్టలేదని ఒక్కోసారి ఆనందపడుతుంటారు కొందరు. లేదంటే పాపాలను విమోచన చేస్తాడని కొందరు, లేదా పాపాత్ముల నుండి స్వేచ్ఛ తెస్తాడని కొందరు ఇలా ఎవరికి అవసరమైనది వాళ్ళు చెప్పొచ్చు. అసలు నల్లగొండ నుండి బయలుదేరిన అరుణవీరుల వల్ల తెలంగాణ విముక్తి పొందిందని, అదే పోరాట స్ఫూర్తిని కలిగించిన అంశమని ఈ ఇద్దరూ చెప్పరు. జంట నగరాల్లో ప్రజలు సఖ్యతగా ఉన్నారంటే సెక్యులర్ శక్తులన్నింటి పాత్ర ఉందని గమనించాలి.

ఇక పంచ భూతాల గురించీ తెలుసుకోవాలి మనం. అంటే ఐదు భూతాలు అని అనుకునేరు. గాలి, నీరు, భూమి, ఆకాశం, అగ్ని ఇవన్నమాట లెక్క ప్రకారం. ఎవరి లెక్క అంటే దానికి పెద్ద స్టోరీ ఉంది. అందుకే ఆ ఐదు భూతాలు ఏమిటి అనే వరకే మన పని. విషయానికొస్తే ఈ పంచ భూతాలను కొన్ని భూతాలు గణపతి బప్పా పేరు పెట్టుకొని కాలుష్యం చేస్తున్నారు. పేల్చే టపాకాయలు గాలి లోకి కాలుష్యాన్ని వెదజల్లడమే కాదు. గాలి ద్వారా పోయి చెవులను పాడు చేస్తున్నాయి. డిజె శబ్దాల గురించి చెప్పే పనే లేదు. ఈ శబ్ద కాలుష్యం చెవులనే కాదు మెదడును కూడా చెడగొడుతుందని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతూనే ఉన్నారు. ఎవరు వింటారు వాళ్ళ మాటలు చెప్పండి?

నీరు రకరకాల రూపాల్లో దర్శనమిస్తుంది ఈ వినాయక నిమజ్జనాల సందర్భంగా. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలు, రంగులు కలిపి తయారు చేసిన బొమ్మలు నీటిని ప్రమాదంలో పడేస్తున్నాయి. దీనివల్ల నీటిలో కాలుష్యం పెరిగి అది భూమిలోకి ఇంకిపోవడమే కాకుండా గాలిలో కూడా మార్పులు తెస్తుంది. ఎండలో వచ్చిన మినరల్ వాటర్ బాటిళ్ళు, కూల్ డ్రింకు సీసాలు నీటినే కాదు గాలిని, భూమిని, ఆకాశాన్ని చివరికి మనుషుల ఆరోగ్యాల్ని పాడు చేస్తున్నాయి. ఇక యువతకు మందుబాటిళ్ళు ఇస్తున్నారు కదా. వాటిలోనూ నీళ్ళే కదా, ఇంకో రూపంలో.

ఇక చెత్తను ఎక్కడికో తీసుకుపోయి పారేసే బదులు, కాల్చేస్తే సులభం కదాని ఆ పని చేస్తున్నారు కొందరు. ఆ విధంగా అగ్నిని వాడి చేస్తున్న కాలుష్యం ఆకాశానికి చేరి అక్కడ ఓజోన్ పొరను దెబ్బ తీస్తుంది. ఊరకే ఎండలు, కుండపోత వర్షాలు, క్లౌడ్ బర్స్టింగులు, వరదలు ఇలాంటి వాటి వెనుక మానవుడు చేస్తున్న కాలుష్యం మనం చూడొచ్చు. సంబురాలు చేసుకునే ప్రతి విషయాన్నీ చేసుకోవాల్సిందే. తప్పు లేదు. ఆ సంబురాల్లో జనం కావాలి, జనం రావాలంటే మొదట వారు ఆరోగ్యంగా ఉండాలి. భక్తి పారవశ్యంలో పంచభూతాల మీద భక్తిని కూడా చాటాలి. పొద్దున లేచినప్పటి నుండీ పంచభూతాలను పూజించేవాళ్ళు ఇంత ముఖ్యమైన విషయాన్ని ఎలా మరచిపోయారో అర్థం కాదు. నిజంగా తమ చుట్టూ ఇంతగా నష్టం జరుగుతున్నట్టు నాయకులందరికీ తెలుసు కాని వినాయకుడికి తెలియదు. తెలిసే అవకాశమూ లేదు. పర్యావరణ ప్రేమికులకు తెలిసినా వాళ్ళ మాట వింటున్నట్టు నటిస్తారే కాని ఎవ్వరూ వినరు. అందుకే గణపతి బప్పా...ఇది ఏందయా అని అడగాలనుంది.

- జంధ్యాల రఘుబాబు,
సెల్ : 9849753298

రెండో వన్డేలోనూ ఆస్ట్రేలియా గెలుపు

లీడ్స్: ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలోనూ ఆస్ట్రేలియా గెలిచింది. ఐదు వన్డేల సిరీస్ భాగంగా శనివారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా జట్టు 68పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 44.4ఓవర్లలో 270పరుగులకు ఆలౌటైంది. క్యారీ(74), మిఛెల్ మార్ష్(60) అర్ధసెంచరీలతో రాణించారు. ఛేదనలో ఇంగ్లండ్ జట్టు 40.2ఓవర్లలో 202పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా బౌలర్లు స్టార్క్‌కు మూడు, హేజిల్‌వుడ్, ఆరోన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ క్యారీకు లభించగా.. మూడో వన్డే మంగళవారం జరగనుంది.

పంత్, గిల్ సెంచరీలు

బంగ్లాదేశ్ లక్ష్యం 515 ప్రస్తుతం 158/4

చెన్నై: బంగ్లాదేశ్ ముందు టీమిండియా 515పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఎంఎ చిదంబరం స్టేడియంలో మూడోరోజు టీమిండియా బ్యాటర్లు రిషబ్ పంత్, ఓపెనర్ శుభ్‌మన్ గిల్ శతకాలతో చెలరేగారు. దీంతో శనివారం టీమిండియా 4వికెట్ల నష్టానికి 287పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు రిషబ్ పంత్ (109: 128బంతుల్లో 13ఫోర్లు, 4సిక్సర్లు), శుభ్‌మన్ గిల్ (119నాటౌట్: 176బంతుల్లో 10ఫోర్లు, 4సిక్సర్లు) సెంచరీలతో కదం తొక్కారు. వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కిది ఆరో శతకం కాగా.. గిల్ ఖాతాలో ఐదోది. 124 బంతుల్లోనే సెంచరీ మార్క్‌ను తాకిన పంత్.. బంగ్లా బౌలర్ మెహిదీకే రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. దీంతో గిల్‌తో నాలుగో వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యానికి తెర పడింది. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన గిల్.. రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగి ఆడాడు. బంగ్లా పేస్, స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని మూడంకెల స్కోరు నమోదు చేశాడు. బంగ్లాపై 158 బంతుల్లో శతకం పూర్తి చేశాడు. పంత్ ఔటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన కేఎల్ రాహుల్ (22నాటౌట్: 19బంతుల్లో 4ఫోర్లు) దూకుడుగా ఆడాడు. దీంతో భారత్ తన రెండో ఇన్నింగ్స్‌ను 4వికెట్ల నష్టానికి 287 పరుగులవద్ద ఇన్నింగ్స్ డిక్లేర్డ్ చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్ 149 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే.

ధోనీని సమం చేసిన పంత్

భారత్ తరపున వికెట్ కీపర్లలో అత్యధిక సెంచరీలు సాధించిన క్రికెటర్ల జాబితాలో ధోనీని పంత్ సమం చేశాడు. అయితే, ధోనీ 144 ఇన్నింగ్స్ ల్లో ఆరు శతకాలు చేయగా.. పంత్ మాత్రం 58 ఇన్నింగ్స్‌ల్లోనే పూర్తి చేయడం గమనార్హం. వీరిద్దరి తర్వాత సాహా 54ఇన్నింగ్స్‌ల్లో 3 సెంచరీలు చేశాడు.

స్కోర్‌బోర్డు...

భారత్ తొలి ఇన్నింగ్స్: 376ఆలౌట్

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ : 149ఆలౌట్

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)లింటన్ దాస్ (బి)నహిద్ రాణా 10, రోహిత్ (సి)జాకిర్ హసన్ (బి)తస్కిన్ అహ్మద్ 5, శుభ్‌మన్ (నాటౌట్) 119, కోహ్లి (ఎల్‌బి)మెహిదీ హసన్ 17, పంత్ (సి అండ్ బి) మెహిదీ హసన్ 109, కెఎల్ రాహుల్ (నాటౌట్) 22, అదనం 5. (64ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 287పరుగులు.

వికెట్ల పతనం: 1/15, 2/28, 3/67, 4/234

బౌలింగ్: తస్కిన్ అహ్మద్ 7-1-22-1, హసన్ మహ్మద్ 11-1-43-0, నహిద్ 6-0-21-1, షకీబ్ 13-0-79-0, మెహిదీ 25-3-103-2, మోమినుల్ 2-0-15-0

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: జాకిర్ హసన్ (సి)జైస్వాల్ (బి)బుమ్రా 33, షాద్మాన్ ఇస్లామ్ (సి)శుభ్‌మన్ (బి)అశ్విన్ 35, నజ్ముల్ హొసైన్ (బ్యాటింగ్) 51, ముష్ఫికర్ రహీమ్ (సి)రాహుల్ (బి)అశ్విన్ 13, షకీబ్ (బ్యాటింగ్) 5, అదనం 8. (37.2ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 158పరుగులు. **వికెట్ల పతనం:** 1/62, 2/86, 3/124, 4/146 **బౌలింగ్:** బుమ్రా 7-2-18-1, సిరాజ్ 3.2-1-20-0, ఆకాశ్ దీప్ 5-0-20-0, అశ్విన్ 15-0-63-3, జడేజా 6-0-29-0.

రిక్కీ భుయ్ మెరుపులు

- మరో సెంచరీకి చేరువలో తెలుగు తేజం
- శ్రేయస్ అయ్యర్ అర్ధసెంచరీ
- ఇండియా-డి 244/5.. ఇండియా-బితో మ్యాచ్
- అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్న పరాగ్, రావత్
- ఇండియా-ఏ జట్టు 270/6.. ఇండియా-సితో మ్యాచ్

రిక్కీ భుయ్ (90)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దులీప్ ట్రోఫీలో తెలుగు తేజం రిక్కీ భుయ్ దూకుడు కొనసాగిస్తున్నాడు. అనంతపురం నగర శివారులోని ఆర్డీటీ క్రికెట్ స్పోర్ట్స్ విలేజ్‌లో శనివారం ఇండియా-బితో జరిగిన మ్యాచ్‌లో.. ఇండియా-డి జట్టు ఆటగాడు రిక్కీ భుయ్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మరో పది పరుగులు చేస్తే టోర్నీలో రెండో సెంచరీకు చేరువకానున్నాడు. ఇండియా-డి జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అర్ధ సెంచరీ చేశాడు. ఇండియా-బి జట్టులో ఆల్‌రౌండ్ వాషింగ్‌టన్ సుందర్ అర్ధ సెంచరీ చేశాడు. ఇండియా-సితో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఏ జట్టు క్రీడాకారులు రియాన్ పరాగ్, శాశ్వత్‌రావత్ అర్ధ సెంచరీలతో రాణించారు. ఆదివారం చివరి రోజు ఆట జరగనుంది.

రిక్కీ భుయ్ మెరుపు ఇన్నింగ్స్.. ఇండియా-డి 244/5

ఇండియా డి జట్టు క్రీడాకారుడు రిక్కీభుయ్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఆంధ్ర కుర్రాడు చూడచక్కని షాట్లతో ప్రేక్షకులను అలరించాడు. కేవలం 87 బంతుల్లో 10 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సహాయంతో 90 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నాడు. రిక్కీ భుయికి తోడుగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 50 (7 ఫోర్లు, ఒక సిక్సర్), సంజు సామ్సన్ 45 (5 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. దేవదత్ పడిక్కల్ 3, శ్రీకర్ భరత్ 2 పరుగులతో నిరాశపరిచ్చారు. దీంతో ఆటముగిసే సమయానికి ఇండియా-డి జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసింది. ఇండియా బి బౌలర్లు ముకేష్ కుమార్ 3, నవదీప్‌శైనీ 2 వికెట్లు తీసుకున్నారు. అంతకుముందు ఉదయం ఓవర్‌నైట్ స్కోర్ 210/6తో ప్రారంభించిన ఇండియా-బి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 282 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో వాషింగ్‌టన్ సుందర్ 82 (7 ఫోర్లు, ఒక సిక్సర్) పరుగులు చేశాడు. ఇండియా-డి జట్టు బౌలర్లలో సౌరభ్‌కుమార్ 5, అర్ష్‌దీప్ సింగ్ 3, ఆదిత్యథాక్‌రే 2 వికెట్లు తీసుకున్నాడు. ప్రస్తుతం ఇండియా డి జట్టు 311 పరుగుల ఆధిక్యతతో ఉంది.

ఆకట్టుకున్న పరాగ్, శాశ్వత్ రావత్.. ఇండియా-ఏ 270/6

ఇండియా ఏ క్రీడాకారులు రియాన్ పరాగ్, శాశ్వత్ రావత్ అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. రియాన్ పరాగ్ 101 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 73, శాశ్వత్ రావత్ 67 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 53 పరుగులు చేశారు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 34, కుమార్ కుష్రగ 40 పరుగులు చేశారు. ఇండియా ఏ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 270 పరుగులు చేసింది. ఇండియా సి జట్టు బౌలర్లలో అన్షుల్ కాంబోజ్, గౌరవ్‌కుమార్, మనవ్ సుతార్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. అంతకుముందు ఇండియా సీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఓర్‌నైట్ స్కోర్ 216/7తో ప్రారంభించిన 71 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అభిషేక్ పోరెల్ 82 పరుగులు చేశాడు. ఇండియా ఏ బౌలర్లు అవేష్‌ఖాన్, అకీబ్ ఖాన్ చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. ప్రస్తుతం ఇండియా ఏ జట్టు 333 పరుగుల ఆధిక్యంలో ఉంది.

'వేట్టైయాన్' నుంచి ప్రివ్యూ ప్రోమో

దసరా పండుగను పురస్కరించుకుని రజనీకాంత్ హీరోగా రూపుదిద్దుకున్న సినిమా 'వేట్టైయాన్' అక్టోబర్ 10న విడుదల కానుంది. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్‌పై ఈ సినిమాను సుభాస్కరన్ నిర్మించారు. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మనసిలాయో' అనే పాట విడుదలై ట్రెండింగ్‌లో ఉంది. ప్రమోషన్స్‌లో భాగంగా ప్రివ్యూ పేరుతో ఒక టీజర్‌ను మేకర్లు విడుదల చేశారు. అనిరుధ్ ఫ్లాష్ బ్యాగ్రౌండ్ మ్యూజిక్ అందించారు. టీజర్‌లో అమితాబ్‌బచ్చన్, రజనీకాంత్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. ఈ సినిమాలో మంజు వారియర్, ఫహాద్ ఫాజిల్, రానా దగ్గుపాటి, రోహిణి, అభిరామి, రితికాసింగ్, దుషారా విజయన్ ఇతర పాత్రల్లో నటించారు. శుక్రవారంనాడు ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం చెన్నైలో జరిగింది. హీరో రజనీకాంత్ మాట్లాడుతూ 'వేట్టైయాన్-ది హంటర్' సినిమా పెద్ద హిట్ అవుతుందన్నారు. లైకా ప్రొడక్షన్స్ తన సొంత నిర్మాణ సంస్థ లాంటిదన్నారు. డైరక్టర్ జ్ఞానవేల్ ఇంకా గొప్పస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అమితాబ్‌బచ్చన్ మాట్లాడుతూ రజనీకాంత్‌తో నటించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు రజనీకాంత్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు.

ఏఎస్ రవికుమార్ కొత్త ప్రాజెక్టు

ఏఎస్ రవికుమార్ చౌదరి తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా ఓ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ చేస్తున్నారు. ఏఎస్ రిగ్వేద చౌదరి సమర్పణలో ఆద్య ఆర్ట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై కార్తీక్ రెడ్డి రాకాసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి FLASH BACK అనే టైటిల్‌ని ఖరారు చేశారు. 'లేనిది ఎవరికి?' అనేది క్యాప్షన్. న్యూ ఏజ్ స్టోరీతో రాబోతున్న ఈ మూవీకి ప్రముఖ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ప్రభాకర్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తుండగా, జేబీ మ్యూజిక్ అందిస్తున్నారు. సుద్దాల అశోక్ తేజ, వరంగల్ శ్రీను లిరిక్స్ అందిస్తున్నారు. ఈ చిత్రానికి రైటర్ డైమండ్ రత్నం బాబు. ఫైట్ మాస్టర్‌గా వెంకట్ వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబధించిన నటీనటులు, ఇతర వివరాలని మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

'రాజాసాబ్' షూటింగ్ అప్‌డేట్

హీరో ప్రభాస్ 'రాజాసాబ్' సినిమా షూటింగ్‌లో బిజీగా గడుపుతున్నారు. ఆయనకు జోడీగా మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమారి తదితరులు నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గురించి మాళవిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తన చిత్రం 'యుధ్రా' ప్రచారంలో పాల్గొన్న ఆమె 'రాజాసాబ్' షూటింగ్‌పై అప్‌డేట్ ఇచ్చారు. 'రాజాసాబ్' రొమాంటిక్ కామెడీ గా రానుంది. నేను ఈ చిత్రంతో తెలుగు పరిశ్రమలో అడుగు పెట్టబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఇప్పటివరకు సరైన స్క్రిప్ట్ కోసం ఎదురుచూశాను. ఇందులో నా పాత్రకు

ప్రాధాన్యం ఉంది. ఇలాంటి సినిమాలో అవకాశం రావటం నా అదృష్టంగా భావిస్తున్నారు. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఇది ముస్తాబవుతోంది. ప్రస్తుతం సగం షూటింగ్ పూర్తయ్యింది. ప్రభాస్ ఇంటి భోజనానికి ఎవరైనా ఫిదా కావాల్సిందే. భోజనమంటే ఏదో ఒక కర్రీ, బిర్యానీ తెప్పించటం కాదు. ఏకంగా పెద్ద పాత్రల్లో ఒక గ్రామానికి సరిపోయేంత ఆహారాన్ని ఏర్పాటు చేస్తారు. ఇప్పటివరకూ నేను అలాంటి రుచికరమైన ఆహారాన్ని తినలేదు' అంటూ ప్రభాస్‌పై మాళవిక ప్రశంసలు కురిపించారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ... విశ్వాసానికి మరో పేరు !
CIRCLE SASTRA CENTRE
డి.నెం.9-35, కావూరి టవర్స్, 1వ అంతస్తు, కామయ్య తోపు సెంటర్, కానూరు, విజయవాడ - 520007, ఆంధ్రప్రదేశ్. E Mail: cs8332@pnb.co.in

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు)

... మొత్తములను ఈ ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంకు బకాయిలకు రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.
తేది : 21-09-2024 సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ పంజాబ్ నేషనల్ బ్యాంక్

బ్యాంక్ ఆఫ్ బరోడా (बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda)
గుంటూరు మెయిన్ బ్రాంచ్
రాజీవ్ గాంధీ భవన్, హిందూ కాలేజ్ దగ్గర, గుంటూరు-522004.
ఫోన్ : 0863-2220244, ఈ-మెయిల్ : Guntur@bankofbaroda.com

ఆఖరు ప్రకటన

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఈ దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు/తనఖాదారు/అద్దెదారు (లు) ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులు తనఖా/చార్జ్‌డ్, సెక్యూర్డ్ క్రెడిటార్ అనగా **బ్యాంక్ ఆఫ్ బరోడా, గుంటూరు మెయిన్ బ్రాంచ్** వారికి ఉంచబడినవి. సదరు ఆస్తులు **భౌతికంగా స్వాధీనత** చేసుకోబడి **10-04-2024**న సిఆర్ఎల్.ఎంపి.నెం.**104/2024** మరియు **15-07-2024**న సిఆర్ఎల్.ఎం.పి. నెం.**313/2024** జారీ చేయబడిన ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి-గుంటూరు కమ్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, గుంటూరువారి న్యాయస్థానం నుండి అందిన ఉత్తర్వు ప్రకారం **18-04-2024** మరియు **10-08-2024** తేదీలలో తనఖా పెట్టిన ఆస్తి యొక్క భౌతిక స్వాధీనత ఆస్తిలో భాగంగా కనుగొనబడిన ఇన్వెంటరీని ఋణగ్రహీత(లు) మరియు హామీదారు/తనఖాదారు/అద్దెదారు(లు) **30-09-2024**న లేదా ఆలోగా క్లియర్ చేయవల్సియున్నది.

ఋణగ్రహీత పేరు: మెస్సర్స్ కనకదుర్గ టొబాకోస్, ప్రొప్రయిటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నవారు: **శ్రీ మండల పాముల రెడ్డి,** డోర్ నెం.116/ఎఫ్, చౌడవరం గ్రామం, గుంటూరు మండలం మరియు జిల్లా, ఆంధ్రప్రదేశ్-పిన్: 522019

ప్రొప్రయిటర్: శ్రీ మండల పాముల రెడ్డి, తండ్రి : వెంకట సుబ్బారెడ్డి, ఫ్లాట్ నం. 3ఎ, సప్తగిరి స్టైల్ అపార్ట్‌మెంట్, విద్యానగర్, 1వ లైన్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-పిన్: 522007

మరొక చిరునామా: మెస్సర్స్ కనకదుర్గ టొబాకోస్, కేరాఫ్ గోడౌన్ ఆఫ్ శ్రీ లీలా కుమార్ , తండ్రి: చంపాలాల్, నాగులపాడు గ్రామం, పెదనందిపాడు మండలం, గుంటూరు-ఆంధ్రప్రదేశ్, పిన్: 522235.

హామీదారు : శ్రీ నరసాని రామిరెడ్డి, తండ్రి : రామ్మోహన రెడ్డి, డోర్ నెం:9-186/1, జంగంగుంట్ల పాలెం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్, పిన్: 522438

తనఖా ఆస్తి వివరములు

గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, అరండల్‌పేట, 16వ లైన్, మున్సిపల్ వార్డు నెం.3, బ్లాకు నెం.2, టి.యస్.నెం.29 లో 2305 చదరపు అడుగులు విస్తీర్ణంలో డోర్ నెం.6-16-15తో 290 చదరపు గజములు విస్తీర్ణం గల స్థలము అందలి గ్రౌండ్, మొదటి మరియు రెండవ అంతస్థులతో గల ఆర్‌సిసి డాబా భవనము అన్ని అనుభవ హక్కులతో సహా. **హద్దులు: తూర్పు:** ముప్పాళ్ళ అచ్చిమాంబ గారి ఆస్తి, **దక్షిణం:** డా.జేమ్స్ గారి స్థలముఆస్తి, **పడమర:** సెయింట్ ఇగ్నాటియస్ స్కూల్, **ఉత్తరం:** మున్సిపల్ రోడ్.

DESCRIPTION OF INVENTORY				
S. No.	WEST SIDE GROUND FLOOR	FIRST FLOOR	S. No.	FIRST FLOOR
1	IRON BERUVA-1	SOFA SET X 2	17	1 X FAN, 1 X GODREJ AC
2	IRON CHAIR-1	PLASTIC CHAIR (9+1)	18	DOUBLE COT BED X 1
3	TUBE LIGHTS-2	DINING SET MARBLE (6+1)	19	DIVAN COT SOFA X 1
4	BIG CHAIR-1	FRIDGE X 2	20	CLOTHES IN CUPBOARDS
5	GOD'S PHOTO BIG SIZE-1	WOODEN VEENA X 1	21	DOUBLE COT BED X 1
6	WINDOW CURTAINS -2	TV SET WALL X 1	22	FAN X 1
7	BIG TABLE -1	GLASS TEA PAI X 1	23	CLOTHES IN CUPBOARD
8	CEILING FAN -1	WOOD COT X 1		
9	SET OF BOOKS IN SHELF -1	CROCKERY ITEMS & GIFTS	24	REVOLVING CHAIR X 1
			25	OLD TV STAND X 1
10		WOODEN PORTRAIL X 1	26	FOOT MASSAGER X 1
11		FANS X 2	27	WOODEN CHAIR X 1
12		BRONZE SWORD SHIELD X 1	28	POOJA SET
			29	EMPTY SUITCASE X 1
13		HOUSEHOLD STEEL SAMANS	30	MATTRESSES X 3
			31	LOCKED BEERUVA X 1
14		1 X OVEN, 1 X FAN, 1 X CYLINDER		
15		GAS STOVE X 1 + 1 X CYLINDER		
16		KITCHEN HOUSE HOLD SAMANS		

30-09-2024 వరకల్లా ఈ లెటర్‌లో తెల్పిన విధంగా ఇన్వెంటరీని క్లియర్ చేయవల్సిందిగా, ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)/తనఖాదారు/అద్దెదారులను అభ్యర్థిస్తున్నాము. లేనియెడల పూర్తి ఇన్వెంటరీని గోదాముకు తరలిస్తామని మరియు అందుకు అయిన వ్యయాన్ని మీరే భరించవల్సి ఉంటుందని మీకు విజ్ఞప్తి మరియు దిగువ సంతకందారు సూచించిన నియమాలు మరియు మార్గదర్శకాల ప్రకారం పై ఇన్వెంటరీ ఆర్టికల్స్‌ను విక్రయించవచ్చు.
తేది : 21.09.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : గుంటూరు బ్యాంక్ ఆఫ్ బరోడా

ICICI Home Finance
కార్పొరేట్ కార్యాలయం : ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (తూర్పు), ముంబాయి-400 059, ఇండియా.
శాఖ కార్యాలయం : 54-20-1బి, యూనిట్ నం.4, మూడవ అంతస్తు, సుప్రియ ప్రకాష్ స్క్వేర్, గురునానాక్ కాలనీ, రెవెన్యూ వార్డు నం.2, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520 007
[రూల్ 8(6)కు నిబంధన చూచుట]
స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు. సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన / చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఏదైనా ఉంది" ప్రాతిపదికన విక్రయించబడునని ...
తేది : 22 సెప్టెంబర్, 2024 అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
ప్రదేశం : విజయవాడ సిఐఎన్ నంబరు- U65922MH1999PLC120106

ADITYA BIRLA CAPITAL — PROTECTING INVESTING FINANCING ADVISING
ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీసు : ఇండియన్ రేయాన్ కాంపౌండ్, వెరవల్, గుజరాత్-362 266.
డిమాండ్ నోటీసు
తేది : 26.05.2023, ప్రదేశం : గుంటూరు, ఆం.ప్ర. సం/- అధీకృత అధికారి, ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్

SMFG Grihashakti
ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
(గతంలో ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా పిలువబడిన)
డిమాండ్ నోటీసు
ప్రదేశం : గుంటూరు / కృష్ణ, ఆం.ప్ర. ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
తేది : 29.08.2024 / 09.09.2024 (గతంలో ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

ADITYA BIRLA CAPITAL | ఆర్థిక పెట్టుబడుల రక్షిత సలహా

ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండ్, వేరవల్, గుజరాత్-362266.
బ్రాంచి ఆఫీసు: ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్, 39-10-10, 1వ అంతస్తు, దత్తాసాయి వేమూరి టవర్స్, ఎం.జి.రోడ్, లబ్బీపేట్, విజయవాడ-520010.

అనుబంధం-4
స్వాధీనతా ప్రకటన
(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1))

ఏదైతే, క్రింది సంతకందారు ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 27.09.2023 నాటి డిమాండ్ నోటీసు** జారీచేసి, **రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులుగా, మెసర్స్ కె.ఎస్. ఎంటర్‌ప్రైజెస్, శ్రీ కలకోటి బోయాజు, శ్రీమతి మంచాల సమాధానం, శ్రీమతి కాలకోటి స్వరూపరాణి, శ్రీమతి సర్‌గ్రేస్ కలకోటి & శ్రీ మంచాల శ్రీను** అనువారిని డిమాండ్ నోటీసు తేది నుండి చెల్లించు/ రియలైజేషన్ తేదీ వరకు తదుపరి వడ్డీ& ఇతర చార్జీలుతోపాటు సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా, నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **18.09.2023 నాటికి గల మొత్తాలు రూ.60,62,354.88 పై. (రూపాయలు అరవై లక్షల అరవై రెండు వేల మూడు వందల యాభై నాలుగు మరియు ఎనభై ఎనిమిది మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు సదరు నోటీసుతో బట్వాడాలో వివాదాలు కలిగి మరియు తదపరి వడ్డీ& ఇతర చార్జీలతోపాటు నోటీసులోని పూర్తి మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫల చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని **07.12.2023న లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకొన్నారు.** సార్ఫసీ యాక్ట్ అనుసరించి **08.12.2023న** రెండు వార్తాపత్రికల్లో పత్రికా ప్రకటన ఇవ్వబడినది.

ఇట్టి పై పరిస్థితుల్లో **20 సెప్టెంబర్ 2024**న సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 14 క్రింద సదరు సదరు ఆస్తిలో అందుబాటులోగల అంశాలుని పరిగణలోకి తీసుకొన్న తరువాత అధీకృత అధికారి, ఇందు దిగువ పేర్కొన్న ఆస్తిని **భౌతికంగా స్వాధీనంచేసుకొన్నారు.** మరియు సర్క్యులర్ ఎంపి.నం.456 ఆఫ్ 2024 లో కోర్టు ఆదేశం ప్రకారం అధీకృత అధికారికి స్వాధీనం అప్పగించుట జరిగింది.

ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, డిమాండ్ నోటీసు తేది నుండి చెల్లించు/ రియలైజేషన్ తేదీ వరకు తదుపరి వడ్డీ& ఇతర చార్జీలతోపాటు **18.09.2023 నాటికి గల రూ.60,62,354.88 పై. (రూపాయలు అరవై లక్షల అరవై రెండు వేల మూడు వందల యాభై నాలుగు మరియు ఎనభై ఎనిమిది మాత్రమే)**లను చెల్లించుటకులోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)పై రుణగ్రహీతలు శ్రద్దవహించవలసిందిగా కోరబడుచున్నది.

తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ

గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్-రిజిస్ట్రీ, మంగళగిరి లో గల డిమార్కేషన్ నం.209/బి3, 209/1సి, డోర్ నం.5-589, అసెస్మెంట్ నం.1023015073 గల దానికి నిర్మాణంలో దాని ఆర్‌సిసి భవనముతోపాటు 96.8చ.గ.లు లేదా 81.312చ.మీ.ల విస్తీర్ణపు ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: బాట; దక్షిణం: గడ్డం ప్రసాద్ ఆస్తి; పడమర: రావూరి దేవదాస్ ఆస్తి; ఉత్తరం: పెరిపోగు అంకమ్మ, రఘు, దాసు, యాకోబ్ యొక్క మిగతా ఆస్తి

తేది: 20.09.2024,
ఎల్ఏఎన్: ABFLVJWLAP0000070813, ABFLVJWLAP0000095873& ABFLVJWLAP0000535653

ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ తరపున అధీకృత అధికారి

బెయిల్‌పై బయటకు వచ్చి కాల్చేశాడు

- యుపిలో అత్యాచార బాధితురాలిపై నిందితుడి ఘాతుకం

లక్నో : బిజెపి పాలిత ఉత్తర ప్రదేశ్‌లో అత్యాచారాలు, హత్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. బెయిల్‌పై బయటకు వచ్చిన అత్యాచార నిందితుడు.. బాధితురాలిని తుపాకీతో కాల్చి చంపిన దారుణ ఘటన ఆ రాష్ట్రంలోని శంభాల్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు నిందితుడితోపాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 20 ఏళ్ల రింకూ 17 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఘజియాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. రింకూ ఈ నెలలో బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యాడు.

ఈ నెల 18వ తేదీ రాత్రి వేళ తల్లితో కలిసి సోదరుడి బైక్‌పై వెళ్తున్న బాధిత యువతిని తన స్నేహితుడితో కలిసి అడ్డుకున్నాడు. ఆమెపై గన్‌తో కాల్పులు జరిపి హత్య చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు రింకూ, అతడి అనుచరుడిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్రాంతంలోని సిసి టీవీ ఫుటేజ్‌ను సేకరించి పరిశీలిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

34 వేల ఆలయాల్లోనూ నందిని నెయ్యి వినియోగం

- కర్ణాటక ప్రభుత్వం ఆదేశం

బెంగళూరు : ఆలయాల ప్రసాదాల విషయంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఆ రాష్ట్రంలోని దేవాలయ బోర్డు పరిధిలోని 34,000 ఆలయాల్లో తప్పని సరిగా కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కెఎంఎఫ్) ఉత్పత్తి చేసే నందిని నెయ్యిని మాత్రమే వినియోగించాలని ఆదేశించింది. భక్తులకు అన్నదానం, ప్రసాదం నాణ్యతలో రాజీ పడవద్దని ఆలయ సిబ్బందికి సూచించింది. 'కర్ణాటక రాష్ట్రంలోని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నోటిఫై చేసిన అన్ని దేవాలయాలలో సేవలు, దీపాలు, అన్ని రకాల ప్రసాదాల తయారికి, దాసోహ భవన్‌లో క్రతువులకు నందిని నెయ్యిని మాత్రమే ఉపయోగించాలి. ఆలయాల్లో తయారు చేసే ప్రసాదాల నాణ్యతను కొనసాగించాలి' అని కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విశ్వ విద్యాలయాలు దేశ ప్రగతికి చిహ్నాలు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

విశ్వవిద్యాలయాలు దేశ ప్రగతికి చిహ్నాలని, మేధావులను సమాజానికి అందించే వేదికలని తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం 70 వసంతాల వేడుక శనివారం వర్శిటీలోని విద్యార్థి సంక్షేమ, సాంస్కృతిక విభాగాధ్వర్యంలో సెనేట్ హాల్ వేదికగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ మాట్లాడుతూ.. తాను ఎస్‌వియు నుంచే ఉన్నత విద్యను అభ్యసించానని,వర్శిటీ వ్యవస్థాపక దినోత్సవానికి ఎమ్మెల్సీగా ముఖ్య అతిథిగా రావడం సంతోషంగా ఉందన్నారు. ఇన్చార్జి వీసీ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ.. దేశానికి ఎంతోమంది రాజకీయ, పారిశ్రామిక, సామాజిక, ఆర్థిక వేత్తలను అందించిన ఘనత ఎస్‌వియుకు దక్కుతుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ వర్శిటీ విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తున్నారని సంతోషం వెలిబుచ్చారు. ప్రముఖ రచయిత డాక్టర్ వీఆర్ రాసాని రచించిన 'కపిరి' నవలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు.

సైబర్ నేరగాళ్లతో ప్రమాదం

- జెఎన్‌టియు ప్రిన్సిపల్ పి.చెన్నారెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

సైబర్ నేరగాళ్ల వల్ల సమాజం, ప్రజలకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని, విద్యార్థులు వీటిపై అప్రమత్తంగా ఉండాలని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నారెడ్డి తెలియజేశారు. శనివారం నాడు అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జి.మమత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ.. ఈమెయిల్స్‌లో అనుమానాస్పద లింక్స్‌పై క్లిక్ చేయరాదన్నారు. ఎటిఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తుల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పరాదన్నారు. రీసోర్స్ పర్సన్ ఇజ్, సి -డాక్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.జగదీష్ బాబు మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల పెరుగుదల కారణంగా సైబర్ బెదిరింపులు అధికం అయ్యాయన్నారు. విద్యార్థులు వీటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ ట్రైనింగ్ డాక్టర్ సి.రామకృష్ణయ్య, మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ కళ్యాణి రాధా , పిఆర్ఓ డాక్టర్ బి. ఓంప్రకాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థుల ఆకలి కేకలు

- వేళకు భోజనం పెట్టడం లేదని ఆందోళన
- తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లా కేంద్రంలో పార్వతీపురం పట్టణ నడిబొడ్డున ఉన్న కురుపాం ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ఆకలి కేకలతో అలమటించారు. సమయానికి తమకు భోజనం అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమ కంటే ముందు ఉపాధ్యాయులే తినేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మెనూ అమలు కావడం లేదన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల్లేవని, ఫ్యాన్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. మిగిలిన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల కంటే ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఎక్కువ మెనూ ఛార్జీలు అమలు చేస్తోందని, ఏకలవ్య పాఠశాల భవనం త్వరగా నిర్మించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, పాఠశాల సొంత భవనం నిర్మాణం పూర్తి కావడానికి కొంతసమయం పడుతుందన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఫ్యాన్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

29, 30 తేదీల్లో డబుల్ డెక్కర్ రద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 29న తిరుపతి-విశాఖపట్నం డబుల్ డెక్కర్, ఈనెల 30న విశాఖపట్నం- తిరుపతి డబుల్ డెక్కర్ రద్దు చేశారు. ఒడిసాలోని బాలసోర్ వద్ద జరిగిన ఘోర ప్రమాదంలో 300మందికి పైగా ప్రయాణికులు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. అటువంటి దుర్ఘటనలు తిరిగి జరగకూడదనే ఉద్దేశంతో భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరిస్తోంది. పనులకు ఆటంకాలేర్పడతాయనే ఉద్దేశంతో కొన్నిరైళ్లను రద్దుచేయడం, దారిమళ్లించడం చేసింది.

కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రేస్ లైన్, గాయత్రినగర్, ఘంటసాలవారి వీధి, విజయవాడ, కృష్ణా జిల్లా-520008

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(అపెండిక్స్ IV SARFAESI చట్టం నందలి రూల్-8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 నందు చట్టం 54) ప్రకారం **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, సీతారామపురం బ్రాంచ్, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తమును, దానిపై వడ్డీతో కలిపి చెల్లించవలసినదిగా ఈ క్రింది పేర్కొనబడిన ఋణగ్రహీత(లు)/హామీదారులను కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.

ఋణగ్రహీత(లు) సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 నందలి రూల్ 8 ప్రకారము క్రింది వివరించిన ఆస్తులను **17-09-2024వ తేదీన స్వాధీనత** తీసుకోవడమైనదని ఈ క్రింది పేర్కొనబడిన ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)ను మరియు ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా దిగువ ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా క్రింది పేర్కొనబడిన ఋణగ్రహీత(లు) బాకీ మొత్తమునకు, వడ్డీ, ఖర్చులు మొదలగునవి **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, సీతారామపురం బ్రాంచ్, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా** వారి ఛార్జీకి లోబడి వుంటాయి. ఒకవేళ డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత జమలు ఉన్నట్లయితే అవి సర్దుబాటు చేయబడును.

సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) చట్టప్రకారము ఋణగ్రహీత(లు) తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

ఋణగ్రహీతలు, బకాయి, డిమాండ్ నోటీసు & స్వాధీనత నోటీసు తేదీలు మరియు ఆస్తుల వివరాలు

1	**ఋణగ్రహీత: శ్రీ. తలారి వేణు గోపాలరావు, తండ్రి: యాకోబు,** డి.నెం. 4-47ఎ, హరిజనవాడ, ఎస్.సి. కాలనీ, ఆకునూరు-521245, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. **హామీదారు పేరు మరియు చిరునామా: (1). శ్రీమతి. కామిరెడ్డి స్పందన, భర్త: తలారి వేణు గోపాలరావు,** డి.నెం. 35-6-63, యసోబు వీధి, గిరిపురం, విజయవాడ-520010, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. **(2). శ్రీ. జెట్టి కోటేశ్వర రావు, తండ్రి: ప్రభాకర రావు,** డి.నెం.5-70/1, పట్నం మాల పల్లి, అమరావతి-522020, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. **లోన్ అకౌంట్ నెం. 96009671546, బకాయి మొత్తం: రూ. 2,96,869/- (అక్షరాల రెండు లక్షల తొంభై ఆరు వేల ఎనిమిది వందల అరవై తొమ్మిది రూపాయలు)** + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు. **డిమాండ్ నోటీసు తేది:** 08-05-2024; **స్వాధీనత నోటీసు తేది: 17-09-2024.** **స్థిరాస్తి వివరములు:** గుంటూరు జిల్లా, అమరావతి మండలం, సమీప డోర్ నెం.5-57, ఆర్.ఎస్. నెం. 251/B నందు **145.2 చ॥గ॥ లేదా 121.43 చ॥మీ॥ ఇంటి స్థలం. హద్దులు:- తూర్పు:** గుడిసె చిన్న రాములు యొక్క భూమి, **దక్షిణం:** సర్కార్ బజారు, **పడమర:** గుడిసె దేవదానంకు చెందిన ఇల్లు, **ఉత్తరం:** గుడిసె ఎస్తేరు మరియు ఇతరులకు చెందిన భూమి.
రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా జెఎన్‌యు యుద్ధ భూమిలో ఎదిగిన సీతారాం ఏచూరితో అనుభవాలను, జ్ఞాపకాలను జెఎన్‌యు కామ్రేడ్స్ పంచుకున్నారు. శనివారం నాడిక్కడ స్థానిక ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ)లో ఏర్పాటు చేసిన సంస్మరణ సభ "సెలబ్రెటింగ్ సీత... రిమంబరింగ్ సీత"లో జెఎన్‌యు విద్యార్థి సంఘం తొలితరం నాయకులు సీతారాం ఏచూరిని స్మరించుకున్నారు. జెఎన్‌యు విద్యార్థి సంఘం తొలి అధ్యక్షుడిగా పనిచేసిన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కరత్ తొలుత తన జ్ఞాపకాలను పంచుకున్నారు. సీతారాం ఏచూరి 1973లో జెఎన్‌యులో ఎంఎ ఎకనామిక్స్‌లో చేరారు. జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పోటీ చేసిన తనకు సీతారాం ప్రచారం చేశారని, రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారని చెప్పారు. 74 నుండి కలిసి పనిచేయడం ప్రారంభించామని తెలిపారు. ఎమర్జెన్సీ తరువాత, యూనియన్ అధ్యక్షుడు అయిన సీతారాం, ఎమర్జెన్సీకి ముందు ఉన్న జెఎన్‌యుని పునర్నిర్మించడానికి గట్టి ప్రయత్నాన్ని ప్రారంభించారు. ఛాన్సలర్ ఇందిరాగాంధీపై పెట్టిన ఛార్జిషీట్‌ను ఆమె ముందే ఆయన చదివి వినిపించడం ఓ చారిత్రక ఘట్టమని తెలిపారు. దశాబ్దాల తరువాత మోడీ ప్రభుత్వం ఏర్పాటైన రెండో వార్షికోత్సవం సందర్భంగా జెఎన్‌యుపై దాడి జరిగినప్పుడు మళ్లీ సీతారాం తెరపైకి వచ్చారని గుర్తు చేశారు. హిందుత్వ రాష్ట్ర ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలు చేయాలన్న ఉద్యమానికి జెఎన్‌యు పెను సవాల్ అని, దానిని ధ్వంసం చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీతారాం ఎత్తిచూపారని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగాన్ని పరిరక్షించే పోరాటంలో ఎప్పుడూ ముందుండే జెఎన్‌యుపై జరుగుతున్న దాడులను చేధించడమే సీతారాంకు మనమిచ్చే ఘనమైన నివాళి అని కరత్ అన్నారు. జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షులు డి.రఘునందన్, జగదీశ్వర్ చతుర్వేది, రష్మీ దొరైస్వామి, టికెఅరుణ్, నళినీ రంజన్ మొహంతి, అమిత్‌సేన్ గుప్తా, సురాజిత్ మజుందార్ తదితరులు మాట్లాడారు. సోహైల్ హష్మీ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

బిజెపి, ఎల్‌జి కుట్రలతో ఆగిన పనులు పూర్తి చేస్తా

- సిఎం అతిషి మర్లెనా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి, ఎల్‌జి కుట్రలతో ఆగిపోయిన పనులు పూర్తి చేస్తానని, ఎన్నికల వరకు ప్రజల డిమాండ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయడమే తన పని అని ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి అతిషి మర్లెనా పేర్కొన్నారు. కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో ఢిల్లీ ప్రజల పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. శనివారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత అతిషి తొలిసారి మీడియా సమావేశం నిర్వహించారు. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయని, ప్రజలందరూ భారీ మెజారిటీతో కేజ్రీవాల్‌ను సిఎంను చేయాలని కోరారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దురుద్దేశంతోనే జరిగిందని బిజెపికి సుప్రీంకోర్టు సందేశం ఇచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు తమ యజమాని మాటను మాత్రమే వింటాయని, పంజరంలో బంధించిన చిలుకలాంటివని కోర్టు పేర్కొందని గుర్తు చేశారు. సిఎం బాధ్యతను తనకు అప్పగించినందుకు కేజ్రీవాల్‌కు ధన్యవాదాలు అని ఆమె అన్నారు.

సిఎం అతిషి వద్ద 13 శాఖలు

సిఎం అతిషి, మంత్రులకు శాఖలు కేటాయించారు. అతిషి గతంలో నిర్వహించిన శాఖలనే మళ్లీ నిర్వహిస్తున్నారు. మొత్తం 13 శాఖలను ఆమె నిర్వహించారు. ముఖ్యమంత్రి అతిషి విద్య, ఆర్థికం, ప్రణాళిక, పిడబ్ల్యుడి, వాటర్, పవర్, పౌర సంబంధాలు, విజిలెన్స్, న్యాయ, రెవెన్యూ వంటి 13 కీలక శాఖలను నిర్వహిస్తారు. మంత్రి సౌరభ్ భరద్వాజ్ అర్బన్ డవలప్‌మెంట్, నీటి పారుదల, ఆరోగ్యం, పరిశ్రమలు, పర్యాటకం, సామాజిక సంక్షేమం వంటి ఎనిమిది శాఖలు నిర్వహిస్తారు. మంత్రి గోపాల్ రాయ్ డవలప్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, పర్యావరణ, అటవీ వంటి మూడు శాఖలు నిర్వహిస్తారు. మంత్రి కైలాశ్ గెహ్లాట్ ట్రాన్స్‌పోర్టు, మహిళా, శిశు సంక్షేమం వంటి ఐదు శాఖలను నిర్వహిస్తారు. మంత్రి ముకేశ్ అహ్లావత్ గురుద్వారా ఎన్నికలు, ఎస్‌సి, ఎస్‌టి, కార్మిక, ఉపాధి, భవనాలు, భూములు వంటి ఐదు శాఖలను నిర్వహిస్తారు. మంత్రి ఇమ్రాన్ హుస్సేన్ ఆహారం, పంపిణీ, ఎన్నికల వంటి రెండు శాఖలను నిర్వహిస్తారు.

కామ్రేడ్ లారెన్స్ మృతికి పొలిట్‌బ్యూరో సంతాపం

న్యూఢిల్లీ : ట్రేడ్ యూనియన్ నేత, సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎం.ఎం.లారెన్స్ మృతి పట్ల పార్టీ పొలిట్‌బ్యూరో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. వివిధ పదవుల్లో పార్టీకి ఆయన విశేష సేవలందించారని కొనియాడింది. ఎర్నాకుళం జిల్లా కార్యదర్శిగా, కేరళ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఆయన సుదీర్ఘకాలం పని చేశారని తెలిపింది. అతడు ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకుడు. ఎల్‌డిఎఫ్ కన్వీనర్‌గా కూడా పని చేశారు. ఆయన కుటుంబసభ్యులకు పొలిట్‌బ్యూరో తన సానుభూతిని తెలియజేసింది.

అవిశ్రాంత పోరాట యోధుడు

యువకుడిగా వుండగానే క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన లారెన్స్ ఎడపల్లి పోలీసు స్టేషన్‌పై దాడి చేసినందుకు అరెస్టయ్యారు. పార్టీలోనూ, బయట ప్రజా జీవనంలోనూ ఆయన పోరాటయోధుడిగానే వున్నారు. తాను నమ్మిన సిద్ధాంతాలు, విలువల కోసం ఆయన అవిశ్రాంతంగా పోరాడారు. ఏడు దశాబ్దాలకు పైబడిన ఆయన రాజకీయజీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు వున్నాయి. క్రమశిక్షణ కలిగిన కార్మిక సంఘ నేత అయిన లారెన్స్ సిఐటియులో ఉపాధ్యక్షుడితో సహా అనేక పదవులు నిర్వహించారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళనలతో దేశం అట్టుడుకుతున్న వేళ రాజకీయ రంగ ప్రవేశం చేసిన లారెన్స్ విద్యార్థిగా వున్నప్పుడు మూడు రంగుల బ్యాడ్జీని చొక్కాజేబులో పెట్టుకున్నందుకు ఎర్నాకుళం స్కూలు నుండి తొలగించారు. ఆ తర్వాత వేరే స్కూలుకు మారినా పదో తరగతి తర్వాత ఆయన చదువు కొనసాగించలేదు. తన పూర్తి సమయాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు, కమ్యూనిస్టు పార్టీకే కేటాయించారు.

అవిభక్త కమ్యూనిస్టు పార్టీకి ఎర్నాకుళం మండల కార్యదర్శిగా తొలినాళ్లలో పనిచేసిన ఆయన 1968 నుండి 1977 వరకు సిపిఎం ఎర్నాకుళం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1978 నుంచి 1998 వరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా వున్నారు. 1980లో ఇడుక్కి నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

సిఐటియు సంతాపం

లారెన్స్ మృతికి సిఐటియు సంతాపం వ్యక్తం చేసింది. 18ఏళ్ళ చిరు ప్రాయంలోనే రాజకీయాల్లోకి ప్రవేశించిన లారెన్స్ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఎఐటియుసి నేతగా సఫాయి పనివారలనందరినీ ఒక్క తాటిపైకి తీసుకురావడానికి ఆయన కృషి చేశారు. 1950లో చట్టవిరుద్ధంగా నిర్బంధించిన సహచరులను సమర్థించినందుకు గానూ పోలీసుల చేతుల్లో చావుదెబ్బలు తిన్నారు. జైలు జీవితం కూడా అనుభవించారు. సిఐటియు వ్యవస్థాపక నేతల్లో ఆయన ఒకరు. కార్మికుల హక్కులు, వారి ప్రయోజనాల కోసం అలుపెరగని పోరాటం చేసిన లారెన్స్ 1983 నుండి 2010 వరకు సిఐటియు కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఆలిండియా కార్యదర్శిగా చేశారు. 2000 నుండి 2003 వరకు సిఐటియు ఉపాధ్యక్షుడిగా వున్నారు. కొచిన్ పోర్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షుడిగా, జలరవాణా కార్మిక సమాఖ్య నేతగా కూడా పనిచేశారు. ఆయన మృతికి సంతాపసూచకంగా సిఐటియు పతాకాన్ని అవనతం చేశారు.

ఎఐకెఎస్ సంతాపం

కార్మికులు, కర్షకుల మధ్య ఐక్యత ఆవశ్యకతను లారెన్స్ ఎప్పుడూ నొక్కి చెప్పేవారని పేర్కొంటూ అఖిల భారత కిసాన్ సభ ఘనంగా నివాళులర్పించింది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నట్టు ఎఐకెఎస్ అధ్యక్ష కార్యదర్శులు అశోక్ ధావలె, విజూ కృష్ణన్‌లు పేర్కొన్నారు. రాబోయే తరాలకు కూడా ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన మృతికి సంతాపసూచకంగా ఎఐకెఎస్ పతాకాన్ని అవనతం చేశారు.

ఇజ్రాయిల్‌కు ఆయుధ ఎగుమతులకు నిరసనగా లండన్‌లో భారీ మార్చ్

లండన్: గాజాలో ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ నిరసనకారులు లేబర్ పార్టీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న చోటుకి భారీ మార్చ్ నిర్వహించారు. సెంట్రల్ లండన్‌లోని వైట్ హాల్‌లో పాలస్తీనా సాలిడారిటీ క్యాంపెయిన్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఇజ్రాయిల్‌కు ఎఫ్-3 యుద్ధ విమానాల విడిభాగాలను బ్రిటన్ ప్రభుత్వం ఎగుమతి చేయడంపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘిస్తోందని, అటువంటి దేశానికి ఆయుధాల ఎగుమతి ఎలా చేస్తారని ప్రశ్నించారు. నవంబరులో డిపార్ట్‌మెంట్ ఫర్ బిజినెస్ అండ్ ట్రేడ్ విడుదల జేసిన డేటా ప్రకారం బ్రిటన్‌లోని 79 కంపెనీలు ఎఫ్-35 యుద్ధ విమానాల సప్లయి చైన్‌తో అనుసంధానించబడి వున్నాయని తేలింది.

లండన్‌లో లేబర్ పార్టీ కాన్ఫరెన్స్ జరుగుతున్న వేదిక వద్దకు మార్చ్ నిర్వహిస్తున్న నిరసనకారులు

ఎన్నికలను దొంగిలించడంలో మాక్రాన్‌కు గోల్డ్ మెడల్

- ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీ నేత రౌసెల్ విమర్శ

పారిస్ : పారిస్ ఒలింపిక్స్ ముగిసిపోయాయి. కానీ ఇంకా పతకాలు మాత్రం వస్తూనే వున్నాయి. ఎన్నికలను దొంగిలించడంలో అధ్యక్షుడు ఇమ్మానియెల్ మాక్రాన్ బంగారు పతకం సాధించారని ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ (పిసిఎఫ్) జాతీయ కార్యదర్శి ఫాబియెన్ రౌసెల్ వ్యాఖ్యానించారు.

"దొంగలకు పతకాలు ప్రకటించాలనుకుంటే ముందు స్థానంలో మాక్రాన్ వుంటారు. బ్యాలెట్ బాక్సులను హ్యాక్ చేయడంలో ఆయన ఒలింపిక్ ఛాంపియన్." అని రౌసెల్ వ్యంగంగా వ్యాఖ్యలు చేశారు. ఈ వారంలో కమ్యూనిస్టు పార్టీ పత్రిక హ్యూమనైట్ ఉత్సవాల సందర్భంగా వేలాదిమందితో జరిగిన పిసిఎఫ్ ర్యాలీనుద్దేశించి ఆయన ప్రసంగించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాలకు దాదాపు ఐదు లక్షల మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒలింపిక్ పతక విజేతలకు ఆయన అభినందనలు తెలిపారు.

జులైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో వామపక్ష న్యూ పాపులర్ ఫ్రంట్ సంకీర్ణానికి ప్రజలు మెజారిటీ ఇచ్చారు. ఆ సంకీర్ణంలో కమ్యూనిస్టు పార్టీ కూడా భాగస్వామిగా వుంది. ప్రధానిని నామినేట్ చేయాల్సింది, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సింది ఈ సంకీర్ణమే, కానీ అధ్యక్షుడు మాక్రాన్ ప్రజా తీర్పును పక్కనబెట్టారు. మారిన్ లీపెన్ నేషనల్ ర్యాలీ పార్టీతో చేతులు కలిపి మితవాద నాయకుడికి ప్రధాని పదవి కట్టబెట్టారు.

దేశ అధ్యక్షుడిగా మాక్రాన్ కేవలం సంపన్నులనే గౌరవిస్తారని ఈ చర్య రుజువుచేసిందని రౌసెల్ విమర్శించారు. ప్రజా తీర్పును గౌరవించేలా చేసేందుకు న్యూ పాపులర్ ఫ్రంట్ పోరాటాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. ప్రధాని పదవికి ఎన్‌ఎఫ్‌పి అభ్యర్థి అయిన సోఫీ బినెట్ మాట్లాడుతూ మాక్రాన్‌కు, పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలను ఆపేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ఎన్నికలను సమర్థిస్తామన్నారు.

బీరుట్ శివార్లలో ఇజ్రాయిల్ భీకర దాడులు

- టాప్ 2 కమాండర్ మృతి
- ధ్రువీకరించిన హిజ్బుల్లా
- 37కి పెరిగిన మృతులు

బీరుట్ : బీరుట్ శివార్లలో ఇజ్రాయిల్ శుక్రవారం జరిపిన దాడుల్లో మరణించినవారి సంఖ్య 37కి చేరింది. వీరిలో ఏడుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు వున్నారు. 68మంది గాయపడగా, మరో 23 మంది ఆచూకీ తెలియలేదని లెబనాన్ ఆరోగ్య మంత్రి మీడియా సమావేశంలో తెలిపారు. ఈ వారంలోనే లెబనాన్‌లో 70మంది చనిపోయారు. హిజ్బుల్లాకి చెందిన ర్యాడాన్ స్పెషల్ ఫోర్సెస్ యూనిట్ సభ్యులే లక్ష్యంగా ఈ దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. ఈ దాడుల్లో హిజ్బుల్లా టాప్ కమాండర్ ఇబ్రహీం అఖిల్‌తో పాటూ రెండో స్థానంలో వున్న కమాండర్ అహ్మద్ మహమూద్ వహాబి కూడా మరణించారని హిజ్బుల్లా ధ్రువీకరించింది. వీరితో పాటూ 16మంది సభ్యులు కూడా ఈ దాడిలో మరణించారు. ర్యాడాన్ ఫోర్సెస్ సీనియర్ కమాండర్లందరూ అజ్ఞాతంగా సమావేశమైన తరుణంలో తాము దాడి చేశామని ఇజ్రాయిల్ ఆర్మీ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. మొత్తంగా హిజ్బుల్లా మిలటరీ చెయిన్‌ను పూర్తిగా ధ్వంసం చేశామని తెలిపింది. శనివారం కూడా దాడులు కొనసాగాయి. గత 11మాసాల్లో ఎన్నడూ లేని రీతిలో భారీగా ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు బాంబు దాడులు జరిపాయి. ఈ ఏడాది కాలంలో లెబనాన్‌లో 740మంది మరణించారు.

దహియా జిల్లాలోని రెండు నివాస భవంతులపై దాడి చేశారని, ఇది యుద్ధ నేరం కిందకే వస్తుందని లెబనాన్ ఆరోగ్య మంత్రి ఫిరాజ్ అబియాద్, రవాణా శాఖ మంత్రి అలీ హనియె శనివారం పత్రికా సమావేశంలో పేర్కొన్నారు. లెబనాన్‌ను కూడా యుద్ధంలోకి లాగి ప్రాంతీయ ఘర్షణలను విస్తరిస్తోందని విమర్శించారు. లెబనాన్ హోం మంత్రి బాసమ్ మవ్‌లావి మాట్లాడుతూ, ఈ దాడులతో యుద్ధంలో లెబనాన్ నిర్ణయాత్మక దశకు చేరుకుందన్నారు. భవిష్యత్తులో భద్రతా పరిస్థితులు మరింత దిగజారకుండా వుండేలా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇప్పటివరకు సరిహద్దు ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ఘర్షణలు తాజా దాడులతో నగరానికి విస్తరించాయని బీరుట్ నుండి అందిన మీడియా వార్తలు పేర్కొంటున్నాయి. ఇజ్రాయిల్ ఏ రకమైన ఎత్తుగడలకు పాల్పడుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. అంతర్జాతీయ మానవతా చట్టాలను అగౌరవపరచడం కూడా ఈనాడు లెబనాన్‌లో కొత్త స్థాయికి చేరుకుంది. ఈ పరిణామాల పట్ల పశ్చిమ దేశాలు మౌనం పాటిస్తే ఈ పరిస్థితులు సర్వసాధారణం కావచ్చని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

సమతుల్యత లేదు

- మహిళకు వర్క్-లైఫ్ బ్యాలెన్స్ కష్టాలు
- 32 శాతం మంది నుంచే సానుకూలత
- ఐఐఎం-అహ్మదాబాద్ నివేదిక

న్యూఢిల్లీ : గతంతో పోలిస్తే మహిళల్లో అక్షరాస్యతా రేట్ల పెరుగుదలలో సానుకూల ఫలితాలే కనిపిస్తున్నాయి. పని, జీవితం.. ఈ రెండు విషయాల్లో సమతుల్యతను నిర్వహించటంలో మాత్రం మహిళలు కష్టాలే ఎదుర్కొంటున్నారు. వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌ను సాధించినట్టు కేవలం 32.25 శాతం మహిళలే చెప్తున్నారు. కేవలం 46.1 శాతం జిల్లాలు విద్యా సాధికారతను నివేదిస్తున్నాయి. అన్‌పెయిడ్ డొమెస్టిక్ వర్క్‌లో సవాళ్ల గురించి హైలెట్ చేస్తూ ఐఐఎం-అహ్మదాబాద్ తయారు చేసిన నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. ఐఐఎం-అహ్మదాబాద్‌లోని జెండర్ సెంటర్ ఈ నివేదికను రూపొందించింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-4), ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 ల నుంచి దేశవ్యాప్తంగా 705 జిల్లాలలో 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న మహిళల సమాచారాన్ని ఈ అధ్యయనం పోల్చి, విశ్లేషించింది. ఈ నివేదిక సమాచారం ప్రకారం.. మహిళలు, పురుషులలో వర్క్-లైఫ్ బ్యాలెన్స్ సాధించాలంటే ఇంటి పనుల్లో పురుషుల భాగస్వామ్యం అవసరమున్నదని ఐఐఎం-ఎ ప్రొఫెసర్ సతీశ్ దియోధర్ తెలిపారు. "నాలుగు పారామీటర్లను నివేదికలో అధ్యయనం చేశాం. ఇందులో వర్క్-లైఫ్ బ్యాలెన్స్ పారామీటర్ తక్కువ వృద్ధిని నమోదు చేసింది. 32 శాతం మంది మహిళలు మాత్రమే తాము వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌ను సాధించినట్టు చెప్పారు" అని ఆయన అన్నారు. పరిమిత విద్య, ఆర్థిక స్వేచ్ఛ నుంచి చక్కటి వర్క్-లైఫ్ బ్యాలెన్స్ వరకు వివిధ ప్రాంతాలు, భిన్న వర్గాల్లో మహిళలు అసాధారణ సవాళ్లను ఎదుర్కొంటున్నారని ప్రొఫెసర్ వైద్య వేమిరెడ్డి చెప్పారు.తమ కుటుంబాలు, ఆర్థిక స్వావలంబన కోసం మహిళలు ఇంటి పని, ఆఫీసు పని ఇలా రెండింటిలో మునిగిపోతూ సమతుల్యతను మాత్రం పాటించలేకపోతున్నారని కొందరు నిపుణులు చెప్తున్నారు. ఇంటి పని విషయంలో మహిళకు పురుషుడు తప్పక సాయపడాలని సూచిస్తున్నారు. ప్రస్తుత వర్క్ కల్చర్ మారిపోయిందనీ, ఇందుకు ఇంటి నుంచి కూడా మహిళకు పూర్తి స్వేచ్ఛ లభించాలని అంటున్నారు. మహిళల ఆరోగ్యం, వారి ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా కంపెనీలు స్త్రీల విషయంలో కొన్ని కఠిన నిబంధనలు సడలించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వారు అంటున్నారు.

కరోనా కంటే జమిలీ డేంజర్ ప్రజాస్వామ్యానికే ప్రమాదం

- కమల్‌హాసన్ కీలక వ్యాఖ్యలు

చెన్నై : జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్‌హాసన్ కీలక వ్యాఖ్యలు చేశారు. "జమిలీ ఎన్నికల ప్రతిపాదన ప్రమాదకరం, లోపభూయిష్టమైనది. భారత్‌కు ఆ తరహా ఎన్నికలు అవసరం లేదు. భవిష్యత్తులోనూ వాటి అవసరం లేదు. 2014 లేక 2015 సమయంలో ఈ తరహాలో ఎన్నికలు జరిగి ఉంటే.. ఒక పార్టీకే పూర్తి అధికారం దక్కేది. అది నియంతృత్వానికి దారితీసేది. వాక్ స్వాతంత్ర్యం కోల్పోయేవాళ్లం. ఒక్క నాయకుడే ఆధిపత్యం చెలాయించేవాడు. దాని నుంచి మనం తప్పించుకున్నామని అర్థం చేసుకోవాలి. ఆ పరిస్థితి కరోనా కంటే ప్రమాదకరమైంది" అని పేర్కొన్నారు. ఆ ఎన్నికల తాలూకు ప్రభావం కొన్నిదేశాల్లో ఉందని చెప్పారు. సిపిఎం, కాంగ్రెస్, ఆర్‌జెడిసహా పలు ప్రతిపక్ష పార్టీలు జమిలీ ఎన్నికల ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం వాటి నిర్వహణ సాధ్యం కాదని, అందుకోసం రాజ్యాంగానికి ఐదు సవరణలు అవసరమని పేర్కొన్నాయి. అందుకు అవసరమైన సంఖ్యాబలం ప్రభుత్వానికి లేదన్నాయి.

క్వాడ్ సదస్సులో చైనానే ప్రధాన ఎజెండా !

- అమెరికా కుయుక్తులు ఫలించేనా?

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సొంత పట్టణమైన విల్మింగ్టన్‌లో ఈ వారాంతంలో క్వాడ్ సదస్సు జరుగుతోంది. ఈ సదస్సు ఎజెండాలో చైనా సంబంధిత అంశాలే ప్రధానంగా వున్నాయని వైట్‌హౌస్ పేర్కొంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనాతో గల వ్యూహాత్మక పోటీ నేపథ్యంలో తన పట్టును మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతోనే క్వాడ్ సదస్సును నిర్వహిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. క్వాడ్ సభ్య దేశాలకు గల విభిన్నమైన వ్యూహాత్మక ప్రయోజనాలు, చైనాతో వారికి గల ఆర్థిక బంధాలు దృష్టిలో పెట్టుకుంటే విభజనలు తీసుకువచ్చి, ఘర్షణలు సృష్టించాలన్న అమెరికా ఎత్తుగడ నెరవేరడం కష్టం కావచ్చని వారు భావిస్తున్నారు. భద్రత విషయంలో చూసినట్లైతే ఆసియా పసిఫిక్ దేశాలు అమెరికా మీద మరింత ఆధారపడేలా చూసేందుకు క్వాడ్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని అమెరికా భావిస్తోంది. భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లకు వారి వారి అభిప్రాయాలు వున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాతో వ్యూహాత్మక విలీనానికి సంబంధించి అంశాలు వున్నట్లే చైనాతో ఆర్థిక విలీనాంశాలు కూడా క్వాడ్ సభ్య దేశాలకు వున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో క్వాడ్ ద్వారా ఆసియా - పసిఫిక్ ప్రాంతంలో చీలికలు, ఘర్షణలు తీసుకు రావాలన్న అమెరికా ప్రయత్నాలు బెడిసికొట్టే అవకాశాలు లేకపోలేదని చైనా విదేశీ సంబంధాల యూనివర్శిటీ ప్రొఫెసర్ లీ హైడాంగ్ వ్యాఖ్యానించారు.

బైడెన్‌తో మోడీ భేటీ

మూడు రోజుల పర్యటన నిమిత్తం అమెరికా చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీ డెలావర్‌లోని ప్రెసిడెంట్ సొంత పట్టణమైన విల్మింగ్టన్‌లో యుఎస్ అధ్యక్షుడు జోబైడెన్‌తో సమావేశ మయ్యారు. అక్కడ ఓ హోటల్‌లో ఇండియన్ కమ్యూనిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమానికి ప్రధాని హాజరయ్యారు. ఈ పర్యటనలో ఆయన క్వాడ్ సదస్సుకు హాజరు కావడంతో పాటు కీలకమైన ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశంలో ప్రసంగించనున్నారు. గాజాలో ఇజ్రాయిల్ దాడులు, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వంటివి క్వాడ్ సదస్సులో ప్రస్తావించే అవకాశం ఉంది. అంతకుముందు ప్రధాని మోడీకి అమెరికాలోని ప్రవాస భారతీయులు ఘనంగా స్వాగతం పలికారు. మోడీ, బైడెన్ ద్వైపాక్షిక సమావేశంలో, చైనా, రష్యాలు కీలక ప్రాధాన్యత సంతరించుకుంటాయని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్ అంతకుముందు తెలిపారు.

డ్రగ్స్ ముఠాల హింస వెనుక అమెరికా హస్తం : మెక్సికో అధ్యక్షులు ఒబ్రాడర్

మెక్సికో సిటీ : మెక్సికోలోని సినాలోవా రాష్ట్రంలో డ్రగ్స్ ముఠాల మధ్య గత కొద్దికాలంగా చెలరేగిన హింసకు అమెరికానే కారణమని మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెజ్ మాన్యుయల్ ఒబ్రాడర్ విమర్శించారు. అధికారం, పట్టు కోసం రెండు వర్గాల మధ్య సాగే ఆధిపత్య పోరు నేపథ్యంలో గత వారంలో ఈ ప్రాంతంలో చోటుచేసుకున్న ఘర్షణల్లో 50మందికి పైగా మరణించారు. జులై చివరిలో ఈ గ్రూపుల నేతలు ఇద్దరిని అమెరికాలో అరెస్టు చేశారు. అప్పటినుండి ఆధిపత్య పోరాటం ఉధృతమైంది. డ్రగ్స్ ముఠా నేతల్లో ఒకరైన జంబాడాను పట్టుకోవడానికి అమెరికా అధికారులు పెద్ద ఆపరేషన్ నిర్వహించారని ఒబ్రాడర్ పేర్కొన్నారు. సినాలోవావా ప్రాంతంలో నెలకొన్న అస్థిరత, ఘర్షణలకు అమెరికా తీసుకున్న చర్యలు, నిర్ణయాలే కారణమని అన్నారు. ఇలా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే అగ్రరాజ్యంతో సత్సంబంధాలు కొనసాగడం కష్టమని ఆయన అన్నారు. జంబాడా అరెస్టుకు ప్రణాళిక రచించిన వారిపై దేశద్రోహం అభియోగాలు మోపే విషయం పరిశీలిస్తున్నట్లు మెక్సికన్ ప్రాసిక్యూటర్లు తెలిపారు.

బాల్యం బాసలు



ఇప్పుడు రెండు 'అచ్చరాలు'
వచ్చి ఏడుస్తున్నాయిగానీ..
చిన్నప్పుడు నాలుక తిరిగేదెక్కడ

'ఇసుకోలు'కు వెళ్ళాలంటే
కాలరు రెండు కొనలు
నోట్లో నలిగిపోవాల్సిందే
కమీజు కింద అంచులు
నోట్లో నుజ్జు నుజ్జు అవ్వాల్సిందే

'చిన్న ఒకటి'లో ఏడాది పాటు
జలపాతాలు పారిస్తేనే
రెండో ఏడాది బడిలో
'పెద్ద ఒకటో' తరగతి
మూడో తరగతి వరకు
'పలక-పుల్ల'తోనే దిద్దడం
ఆ తరువాతే తెలుగు పుస్తకం!

అన్నట్టు.. పుస్తకమని
ఇప్పుడుగదా తెలిసింది
చిన్నప్పుడు ఇవి మాకు
'బొక్కులు'గానే తెలుసు

నిక్కరు చిరుగులకు పడ్డ
ప్యాచీలపై ప్యాచీలు
గురువు బెత్తం దెబ్బలకు
సుతిమెత్తని లేపనాలు
అదో పోస్టాఫీసు బాల్యం!
సరదాలో పడ్డ చీటీలు ఎన్నో..

కాళ్ళకు 'జోడీలు' వేసుకున్నట్టే లేదు
'చంకలో చిల్లి సంచి' తప్ప
చిల్లిగవ్వ లేకపోయినా
మొలతాడుకు 'సిక్కం' తప్పనిసరి

దొంగా దొర ఆటకు నిర్ణయం
చేతిలో 'పంటలు' తప్పని సరి
'ఉజ్జీ'లు వేస్తే
కాయలు, పువ్వులే పిల్లల పేర్లు

చింతపిక్కలు అరగదీసి
అష్టాచెమ్మా
అద్దు రూపాయి బిళ్ళ తిప్పి
బొమ్మా బొరుసు

గురి కుదిరితే 'పిట్టల గురి'
'నక్కాయల' ఆట్కైతే 'అంటా'తో గురి
గుడ్డ బంతులతోనే 'బేటాట'
మట్టి పెంకులతోనే 'గేమ్' ఆట

'రెండోబడి' ఏ బి సీ డీలతోనే
ఐదో తరగతి ఊర్లో బడికి .. బై బై
'ఇంగిలీసు' అచ్చరాలకై
ఊరు బయట బడికి హాయ్.. హాయ్!

- వినోద్ కుత్తుం, పలాస, శ్రీకాకుళం జిల్లా,
96343 14502.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న అక్షరాల పక్కన సరైన అర్థాలు వచ్చేలా సంయుక్తాక్షరాలను రాయండి. ప్రతి రెండు అక్షరాలకు ఒకే సంయుక్తాక్షరం సరిపోతుంది. (క్లూ ఉంది చూడండి)

్ర, త్త, క్క, మ్మ, ట్ట

క-	అ-
న-	బొ-
తొ-	న-
అ-	పి-
కు-	త-

నేను గీసిన బొమ్మ



ఏ. వైష్ణవి,
10 వ తరగతి,
జి.ప.ఉ.పా.
నర్సింహుల పల్లి,
పెద్దపల్లి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

JEEVANA
జీవన the family



ప్రతీకాత్మక చిత్రం

ఆమె మౌనాన్ని తేలిగ్గా తీసుకోవద్దు!

ఇటీవల దక్షిణాది సినీ ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపుల అంశం చర్చకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో పలువురు సినీ ప్రముఖులు తాము ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలు, చూసిన ఘటనల గురించి నిర్భయంగా చెబుతున్నారు. సాటి వారిని హెచ్చరిస్తున్నారు. వాటిలో కొంతమంది అభిప్రాయాలే ఇవి..

బహిరంగ రహస్యం

ప్రతి ఇండస్ట్రీలోనూ ఇలాంటి పరిస్థితులు ఉంటాయన్నది బహిరంగ రహస్యం. చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులు సాధారణమని అందరూ భావిస్తుంటారు. ఎవరైనా తమ మీద దాడి జరిగిందని చెప్పినా నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడం లేదు. ఏళ్లకు ఏళ్లు కేసులు నడుస్తున్నాయి. అధికారం, రాజకీయ బలం, డబ్బు వల్ల వారిని శిక్షించడం కష్టంగా మారింది' అని తన ఆవేదనను వెల్లగక్కారు గాయని చిన్మయి. తమిళ ఇండస్ట్రీలో ఎన్నో చిత్రాల్లో ఆమె పాటలు పాడారు. గాయనిగానే కాక, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గానూ మంచి పేరు సంపాదించారు. ప్రముఖ సంగీత దర్శకుడు తనపై వేధింపులకు గురిచేశాడని చెప్పినందుకు కొన్నేళ్లపాటు ఇండస్ట్రీ తనపై వేటు వేసింది. 'అతడు చెప్పిన మాట విననందుకు తన కెరియర్‌పై దెబ్బ కొట్టాడ'ని ఆమె ఎన్నోసార్లు వాపోయింది కూడా.

సమంత కూడా ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించారు. సురక్షితమైన, గౌరవప్రదమైన పని ప్రదేశాలు మహిళల కనీస అవసరాలు. ఇప్పటికైనా ఈ విషయాలపై నిర్ణయం తీసుకోవాలి' అని ఆమె కేరళ ఇండస్ట్రీలో ప్రకంపనలు సృష్టించిన హేమ కమిటీ నివేదికపై స్పందించారు.

46 ఏళ్ల నుండి ఇదే సమస్య

అలనాటి తార రాధిక కూడా ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ఇది ఏ ఒక్క ఇండస్ట్రీకో చెందిన సమస్య కాదు. అన్ని చోట్లా ఇదే పరిస్థితి. కారవాన్‌లో సీక్రెట్ కెమెరాలు పెట్టి ప్రైవేటు వీడియోలు చిత్రీకరించిన సందర్భాలు ఉన్నాయి. మహిళలకు ఇలాంటి పరిస్థితులు ఎదురవ్వడం దురదృష్టకరం. 46ఏళ్ల నుండి సినిమాలు చూస్తున్నాను. మహిళల సమస్యలు పెరిగాయే కానీ తగ్గలేదు' అని ఆమెవ్యాఖ్యానించారు.

'ఇది మహిళలకు చీకటి కాలం. ఈ దాడులను ఆపడం కోసం ఏం చేయాలో ఆలోచించాలి. వాస్తవంగా చట్టాలను మార్చాల్సిన సమయం వచ్చింది. గతంతో పోలిస్తే నటీమణులు వారి సమస్యలను ధైర్యంగా చెప్పగలుగుతున్నారు' అని బాలీవుడ్ నటి అనన్య పాండే ఓ ఇంటర్వ్యూలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మాట్లాడారు. 'ప్రతి ఇండస్ట్రీలోనూ చెడు ఉంది. దాన్ని నిర్మూలించాల్సిన అవసరం చాలా ఉంది' అని తంగలాన్ నటి పార్వతీ తిరువోతు అభిప్రాయపడ్డారు.

ముందు ఫిర్యాదు చేయండి

'నటీమణులు తమపై ఏదైనా దాడి జరిగితే మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతున్నారు. అలా చేయవద్దు. ముందు పోలీసు కంప్లైంటు ఇవ్వండి. అలా చేస్తేనే మీకు న్యాయం జరుగుతుంది' అని రోహిణి ఓ సమావేశంలో మాట్లాడారు.

'నువ్వు ఎవరితోనూ చెప్పలేవని, అంత ధైర్యం నీకు లేదని భావించిన కొంతమంది వ్యక్తులు నిన్ను ఇబ్బందులకు గురి చేయడానికి ప్రయత్నిస్తారు. అలాంటి వారికి నో చెప్పడం నేర్చుకోవాలి' అని నటి మంచు లక్ష్మి ఈ విషయంపై తన స్వరాన్ని పెంచి మాట్లాడారు.

సౌకర్యాలు ఉండవు

'సినిమా సెట్‌లో మహిళలకు సరైన పారిశుధ్య సౌకర్యాలు ఉండవు. సమస్యలను ఎదుర్కొంటున్న మహిళలు వాటిని ఎవరితో చెప్పుకోవాలో తెలియక సతమతమైపోతున్నారు. పరిశ్రమలో మహిళలపై వేధింపులు ఆగాలంటే పటిష్టమైన సంస్థలు రావాలి' అని బాలీవుడ్ నటి శ్రద్ధా శ్రీనాథ్ అంటున్నారు. 'పార్టీలకు వెళ్లి ఇంటికి వస్తున్నప్పుడు నా చుట్టూ ఏం జరుగుతుందో గమనించుకునేదాన్ని. డ్రైవర్ ఎటు చూస్తున్నాడో ఎప్పుడూ అప్రమత్తతతో వ్యవహరించేదాన్ని. 8 ఏళ్ల నుండే జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నా' అని కూడా ఆమె తన అనుభవాలను పంచుకున్నారు.

'12 ఏళ్ల నుండి చిత్రపరిశ్రమలో ఉన్నాను. కాలానుగుణంగా ఎన్నో మార్పులు జరిగాయి. వేధింపులకు పాల్పడిన దోషులకు సరైన శిక్ష పడాలి. మీరు ధైర్యంగా ఉండండి. చొరవ తీసుకోవాలని ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే స్పందించండి. గట్టిగా మీ స్వరాన్ని వినిపించండి' అని ఐశ్వర్య రాజేశ్ ఈ అంశంపై మాట్లాడారు.

'చిత్రపరిశ్రమలో ఉన్న ప్రతి మహిళనూ అడగండి. వాళ్ల దగ్గర చెప్పడానికి తప్పకుండా ఓ వేధింపుల కథ ఉంటుంది. కేరళలో వచ్చిన హేమ కమిటీ లాంటి కమిటీలు అన్ని చోట్లా ఉండాలి. అప్పుడే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి' అని కన్నడ నటి నీతూశెట్టి అన్నారు.

ఆమె మౌనాన్ని తేలిగ్గా తీసుకోవద్దు

'ఆమె వ్యక్తిత్వాన్ని చూసి బలహీనురాలిగా భావించొద్దు. ఒంటరిగా ప్రయాణిస్తుందని ఒంటరి దానిగా చూడొద్దు. ఆమె తిరిగి మిమ్మల్ని కొట్టే వరకు తన బలం గురించి మీకు తెలియదు. మహిళలను వేధించేవారు, అసభ్యకరంగా మాట్లాడేవారు ఆమె నేర్పే పాఠాలను జీవితాంతం గుర్తుంచుకుంటారు' అని నటి కుష్బూ మాట్లాడారు. ఇంకా ఆమె మహిళల గురించి ఇలా చెప్పారు. 'స్త్రీ ఎప్పుడూ స్వతంత్రంగా నిలబడాలి. ఏ సందర్భంలోనూ రాజీ పడకూడదు. ఏదైనా విషయంలో మీరు రాజీ పడ్డారంటే ఆ బాధ జీవితాంతం మిమ్మల్ని వేధిస్తూనే ఉంటుంది' అన్నారు. 'మహిళలపై జరుగుతున్న ఈ సంఘటనలపై స్పందించమని సహచర నటులకు కూడా ఆమె పిలుపునిచ్చారు.

AN OCEAN OF OPPORTUNITIES
AWAITS THE AMBITIOUS

THE INDIAN NAVY

online application are invited from eligible unmarried men and unmarried women candidates for grant of Short Service Commission (SSC) for course commencing Jun 2025 at Indian Naval Academy Ezhimala, Kerala.

Branch/Cadre	Vacancies*	Gender
General Service {GS(X)/ Hydro Cadre	56 (Including 06 Hydro)	Men and Women {maximum of 15 vacancies in GS (X) and 02 vacancies in GS (Hydro) for women}
Pilot	24	Men and Women (maximum of 07 vacancies for women)
Naval Air Operations Officer (Air Crew)	21	Men and Women (maximum of 06 vacancies for women)
Air Traffic Controller(ATC)	20	Men and Women (maximum of 06 vacancies for women)
Logistics	20	Men and Women (maximum of 06 vacancies for women)
Naval Armament Inspectorate Cadre(NAIC)	16	Men and Women
Education	15	Men and Women
Engineering Branch {General Service (GS)}	36	Men and Women (maximum of 11 vacancies for women)
Electrical Branch {General Service (GS)}	42	Men and Women (maximum of 13 vacancies for women)

cbc 10701/13/0027/2425

The Vacancies are tentative and may be changed depending on availability of training slots. Candidates will be inducted in the rank of Sub Lieutenant.

LAST DATE FOR SUBMISSION OF ONLINE APPLICATION 29 SEP 2024

For eligibility criteria and specific details for the batch, visit www.joinindiannavy.gov.in and
EMPLOYMENT NEWS DATED 14 SEP 2024

Scan this QR Code to apply online

సౌత్ ఇండియా షాపింగ్ మాల్
సకుటుంబ సమేతంగా అందర్నీ
ఆత్మీయంగా ఆహ్వానిస్తోంది

కొత్తగూడెంలో
సరికొత్త షాపింగ్ ప్రపంచం...

ఉ. గం. 10.30 లకు
నేడే
గొప్ప ప్రారంభం

CELEBRITY GUESTS
ప్రముఖ సినీనటి (డీజే టిల్లు ఫేమ్) కుమారి నేహా శెట్టి గారు
ప్రముఖ సినీనటి (మంగళవారం ఫేమ్) కుమారి పాయల్ రాజ్‌పుత్ గార్లచే

షోరూం ప్రారంభకులు

Sri. Kunamneni Sambasiva rao garu
Member of the Telangana Legislative Assembly, Kothagudem

ముఖ్య అతిథులు

Smt. Seetha Laxmi
Muncipal Chairperson, Kothagudem

Sri. K Chandrashekar Rao
Ex ZP Chairperson

Smt. Badavath Shanthi
Ex MPP, Chunchupalli

Smt. Badavath Suguna
Ex Sarpanch, NK Nagar

Sri. Banoth Govindu
Ex Sarpanch, Vidyanagar

*Conditions apply

కొత్తగూడెం వస్త్ర చరిత్రలో కనీవినీ ఎరుగని
తక్కువ ధరలు
అబ్బురపరిచే డిజైన్లు అంతర్జాతీయ ఫ్యాషన్స్
లక్షల వెరైటీలు
కేవలం 150 రూ. నుండి మొదలు

ప్రారంభోత్సవ ఆఫర్
కాస్ట్ to కాస్ట్ సేల్
అన్ని రకాల వస్త్రాలపై

SOUTH INDIA shopping mall
విద్యా నగర్ కాలనీ, కొత్తగూడెం

1800 570 0999 CALL US
Shop Online 24x7 @ www.SISMO.in | Follow us on: SouthIndiaShoppingMalls SouthIndiaShopping

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68